## సంపాదకీయం

బుధవారం 20-08-2025

# పార్లమెంట్‌లో ఎన్నికల సంస్కరణలపై చర్చించాలి !

బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వ్యవహారం రచ్చ కొనసాగుతోంది. నిజంగానే ఇందులో లోపాలు ఉంటే పరిశీలించి, పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘంపై ఉంది. అందుకు బీహార్ ఎన్నికల సంఘం వెంటనే కార్యాచరణకు దిగాల్సి ఉంది. ఎందుకంటే దేశంలో ఇన్నేళ్లయినా సమగ్ర ఓటు విధానం లేకుండా పోయింది. రాజకీయ నాయకులు ప్రమేయంతో మార్పులు, చేర్పులు చేయడం అలవాట య్యింది. వ్యవస్థీకృత లోపాలకు ఇన్నేళ్లు దేశాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీది ప్రధాన బాధ్యత. అలాగే దానిని కొనసాగిస్తున్న బిజెపిది కూడా. ఈ రెండు పార్టీల పాలనలో కేంద్ర ఎన్నికల సంఘం సర్వస్వతంత్రంగా పని చేయకుండా డమ్మీ పాత్రను పోషించేలా తయారయ్యింది. అలాగే గత పదేళ్లుగా అధికారం చెలాయిస్తున్న మోడీ కూడా ఎన్నికల సంఘాన్ని పటిష్టం చేయకుండా, మరింతగా దిగజారేలా చేస్తూ వచ్చారు. నిజానికి ఓటరు కార్డును పక్కాగా, పకడ్బందీగా రూపొందించడం పెద్ద పనికాదు. ఆధార్, పాన్ కార్డు తరహాలో పక్కాగా ఓటరు కార్డును రూపొందించవచ్చు. కానీ ఎన్నికల సంఘం ఈ తరహా ప్రయత్నాలు చేయడం లేదు. అలాగే ఎన్నికల సంఘం తీరుపై కారాలు మిరియాలు నూరుతున్న రాహుల్ ఎందుకు ఎన్నికల సంస్కరణల పై మాట్లాడడం లేదు. ఎందుకు నిజాయితీగా వ్యవహరించడం లేదు. ఎందుకు పార్లమెంటులో చర్చకు దిగడం లేదు. కేవలం బీహార్ విషయమే గాకుండా మొత్తం ఎన్నికల సంస్కరణలపై మాట్లాడడం ద్వారా, విపక్షనేతగా తన సత్తా చాటుకోవాలి. అలా కాకుండా బీహార్ జాబితాను ముందేసుకుని మాట్లాడితే, ఆ రాష్ట్ర ఎన్నికలు ముగిసాక సమస్య మళ్లీ మొదటికే వస్తుంది. ఎన్నికల జాబితాలో ఎప్పుడు పడితే అప్పుడు ఇష్టం వచ్చినట్లు మార్పులు చేయడం, ఒకే ఇంటినూ వందల సంఖ్యలో ఓట్లు ఉండడం, ఒకే ఇంట్లో ఉన్నవారికి వేర్వేరు పోలింగ్ బూతుల్లో ఓటు కల్పించడం చూస్తున్నాం. నిజానికి దొంగ ఓట్ల సమస్య కూడా ఉంది. దొంగ ఓట్లు వేస్తే ఉరిశిక్ష విధించాలి. పార్టీ మారిన ఎమ్మెల్యేలు అర్హత కోల్పోయేలా చేయాలి. తెలంగానలో పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేల విషయంలో సుప్రీం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, ఈ విషయంలో రాహుల్ ఎందుకు మాట్లాడడం లేదో చెప్పాలి. అందుకే ఎన్నికల సంస్కరణలపై రాహుల్ ముందు మాట్లాడాలి. ప్రతిపక్షనేతగా బాధ్యత తీసుకోవాలి. మోడీ సర్కార్‌ను నిలదీయడం కాదు. దేశ భవిష్యత్ కోసం బాధ్యతగల ప్రతిపక్ష నేతగా మాట్లాడాలి. పటిష్టమైన ఎన్నికల విధానం అమలు కావాలంటే సంస్కరణలు రావాలి. ఇందులో ఉన్న లోటుపాట్లకు సంబంధించి అన్ని విషయాల్లో చర్చ జరగాలి. ఈ పార్లమెంట్ సమావేశాల్లో చర్చ జరిగేలా రాహుల్ బాధ్యత తీసుకోవాలి. ఈ పని ఇన్నేళ్లుగా ఎందుకు చేయడం లేదన్నది గమనించాలి. ఇకపోతే ఒక్క శేషన్ కాలంలోనే ఎన్నికల సంఘం గట్టిగా పనిచేసింది. బీహార్ జాబితా వ్యవహారపై సవాల్ చేసిన పిటిషన్లపై విచారణలో భాగంగా దేశ సర్వోన్నత న్యాయస్థానం భారత ఎన్నికల సంఘం రెండు ముఖ్యమైన ఆదేశాలు జారీ చేసింది. ఓటర్ల జాబితా నుంచి తొలగించిన పేర్ల జాబితాను, తీసివేతకు కారణాలతో సహా ప్రచురించాలని తెలిపింది. ఆధార్ కార్డును ఒక ధ్రువీకరణ పత్రంగా అంగీకరించాలని కూడా పేర్కొంది. 'సర్'ను సవాల్ చేసిన పిటిషన్లపై విచారణ ఇంకా కొనసాగు తోంది. అయితే 'సర్'కు సంబంధించి, న్యాయసమీక్ష పరిధిలోకి రాని, అంశాలు అనేకం ఉన్నాయి. ప్రత్యేక సమగ్ర సవరణ లాంటి కార్యక్రమాన్ని గతంలో ఎన్నడూ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందుగా నిర్వహించలేదు. జననమరణాలు సహజం. చనిపోయిన వ్యక్తుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం సమర్థనీయమే. డబుల్ ఓట్లు ఉన్నా, పలు నియోజకవర్గాల్లో ఓటు ఉన్నా తొలగించాల్సిందే. అందుకు ప్రజలను కూడా బధ్యులు చేయాలి. అలాగే 18 సంవత్సరాల నిండిన యువతీ యువకుల పేర్లను ఓటర్ల జాబితాలో విధిగా చేర్చడం కూడా ముఖ్యమే. ఇకపోతే బీహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ తొలిదశను కేవలం 30 రోజులలో ఎందుకు పూర్తి చేశారన్న అనుమానాలు ఉన్నాయి. ప్రత్యేక సవరణలో 64 లక్షల మంది ఓటర్ల పేర్లను జాబితాను తొలగించినట్టు ఈసీఐ వెల్లడించింది. వీరిలో 22 లక్షల మంది 'మరణించి నట్టు', 7 లక్షల మంది పలు ప్రదేశాలలో ఓటర్లుగా నమోదు చేయించు కున్నారని, 36 లక్షల మంది బిహార్ నుంచి శాశ్వతంగా వలస పోయినవారు లేదా ఎటువంటి జాడ తెలియనివారు అని ఈసీఐ పేర్కొంది. నిజంగానే ఇది నిజమైతే సుప్రీం ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం వివరాలు ప్రకటించాలి. 36 లక్షల మంది బిహారీలు 'శాశ్వతంగా వేరే ప్రదేశాలకు వెళ్లిపోయారని' లేదా 'జాడ తెలియనివారు' అన్న నిర్ణయానికి ఎన్నికల సంఘం నిర్ణయించడానికి గల ఆధారాలు ఇవ్వాలి. కానీ ప్రస్తుత సవరణ తరవాత తాము ఓటు హక్కు కోల్పోతామేమోనని బిహార్‌లో లక్షలాది ఓటర్లు భయపడుతున్నారు. ఈ ఏడాది చివరలో జరగనున్న శాసనసభ ఎన్నికలలో తాము ఓటేసేందుకు లేకుండా పోయిందన్న భయంలో ఉన్నారు. నిజానికి ఇలాంటి చిన్నిచిన్న సమస్యలను కూడా పట్టించుకోకుండా ఎన్నికల సంఘం తన పనితీరును కొనసాగించడం సరికాదు. అందుకే ఎన్నికల సంఘం చట్టబద్ధమైన సంస్థగా వ్యవహరించడం లేదన్న విమర్శలు తరచూ వస్తున్నాయి. ఎవరికో ఒకరికి వత్తాసు పలికేందుకు ఎన్నికల సంఘం పనిచేయరాదు. జవాబుదారీ తనం ముఖ్యం. తాను రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థనని గుర్తించాల్సిందే. అలాగే తప్పులు జరిగినప్పుడు ఎన్నికలతో ప్రమేయమున్న ఓటర్లు, అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు జవాబుదారీగా కూడా ఉండాలి. బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై రాజకీయ పార్టీలు ఆరోపణలు చేసి, పార్లమెంట్‌ను బహిష్క రించడం సరికాదు. కేవలం వాయిదా తీర్మానంలోనే చర్చించాలన్న మూర్ఖపు వాదనా సరికాదు. బీహార్‌తో పాటు మొత్తం ఎన్నికల సంస్కరణలపైనే పెద్ద చర్చ జరగాల్సి ఉంది. దీనికి రాహుల లేదా ఇండియా కూటమి నేతలు సిద్ధం కావాలి. పార్లమెంటులో చర్చించడానికి ఎన్నో మార్గాలు ఉన్నాయి. వాటి ద్వారా చర్చకు వెళ్లాలి. పార్లమెంట్ బహిష్కరణలు, ర్యాలీలు, విమర్శలు, ధర్నాలు,పాదయాత్రలు వంటివన్నీ పాతపద్ధతులు. ఇవన్నీ కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్దేశించినవి మాత్రమే. పార్లమెంటులో చర్చ ద్వారా రాజ్యాంగ సవరణకు పూనుకోవాలి. మోడీ ప్రభుత్వంతప్పిదాలు ఉంటే నిలదీయండి. అలాగే గతంలో తమ పాలనకాలంలో జరిగిన తప్పులంటే క్షమాపణలు కోరండి.

# మారిన ఆదిమూలం స్వరం.. భయమా? మార్పా?



అమరావతి,టీడీపీ బహిష్కృత ఎమ్మెల్యే ఆదిమూలం స్వరం మార్చారు.. ప్రభుత్వము పై ధిక్కార స్వరం వినిపిస్తున్నారు .. ముఖ్యమంత్రి పట్ల విధేయత చూపుతునే తన ఈ స్థితికి కారణమైన వారితో అమితుమి తెల్చుకోవాలని క్షేత్రస్థాయిలో ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. దీంతో ఇదే అదనుగా వైసీపీ సైతం ఆదిమూలాన్ని తమ గూటిలోకి తెచ్చుకోవడానికి బేరసారాలకు సిద్ధమవుతుందనే వార్తలు వినవస్తున్నాయి.. దానికితోడు సత్యవేడు నియోజకవర్గంలోని టిడిపి లోని ఓవర్గం సైతం ఆదిమూలం కు సహకరిస్తున్నట్లు సమాచారం. దీంతో ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో ఆదిమూలం వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది..

### పెద్దిరెడ్డిని ఎదిరించి వైసీపీని వీడిన కోనేటి ఆదిమూలం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సత్యవేడు నియోజకవర్గం గత రెండు సంవత్సరాలుగా వార్తల్లో ఉంది.. వైసీపీలో పవర్ సెంటర్ అయిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎదిరించి బయటకు వచ్చిన ఆ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిమూలానికి గత శాసనసభ ఎన్నికలలో టిడిపి టికెట్ ఇచ్చింది. కూటమి వెల్లువలో ఆయన విజయం సాధించాడు..ఇలాంటి తరుణంలో అక్కడున్న పకృతి వనరుల మీద కన్నెసిన కింగ్ మేకర్లు ఆదిమూలం బలహీనత మీద దెబ్బకొట్టి ఓ మహిళ చేత వీడియోలు తీయించి అమె ద్వారా వాటిని బయటపెట్టించి విజయవంతంగా టీడీపీ నుంచి సస్పెండ్ చేయించి నియోజకవర్గం మీదా పట్టు సాధించడానికి ప్రయత్నించారు.

### క్వారీలతో పాటు ఎర్రమట్టి విక్రయ దందాలు

అందులో భాగంగా నియోజకవర్గంలోని క్వారీలతో పాటు ఎర్రమట్టి అమ్మకాలు సాగించారు. ఈనేపధ్యంలో నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ దందాలపై దృష్టి సారించిన పార్టీ తాజాగా అక్కడ నియోజకవర్గ పార్టీ కార్యక్రమలు అమలు కోసం కాంట్రాక్టర్ శంకర్ రెడ్డిని రంగంలోకి దింపింది.. దీంతో నియోజకవర్గంలో సీన్ మారింది. ఆ క్రమంలో సత్యవేడులో ఫక్తు వ్యాపార రాజకీయం నడుస్తోంది. గతంలో ఉన్న కింగ్ మేకర్లు ఎమ్మెల్యేని డమ్మీని చేసి ఎర్రమట్టి అక్రమ రవాణా నడిపారనే ప్రచారం ఉంది. గతంలో వైసీపీ ప్రభుత్వంలో వైఎస్ అవినాష్ రెడ్డి అంతరంగికుడు అయిన ఓ లీజు దారుడికి దందా కట్టబెట్టారన్న ఆరోపణలున్నాయి. అతను ప్రభుత్వం మారాక కూడా యథేచ్ఛగా అక్రమ దందా చేస్తున్న సమాచారం అధిష్టానానికి తెలిసి వారి పవర్ సెంటర్ బద్దలు కొట్టడానికి శంకర్ రెడ్డిని రంగంలోకి దింపిందని నియోజకవర్గంలో ప్రచారం జరుగుతుంది.

### వైసీపీ వారికి శంకర్‌రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపణలు

అయితే శంకర్ రెడ్డి వైసిపి నుంచి కొంతమందిని టీడీపీలోకి తీసుకురావడంతో పాటు వారికి ప్రాధాన్యత ఇస్తున్నాడని టీడీపీ క్యాడర్ గుర్రుగా ఉంది. దీనికితోడు వైసిపి నుంచి వచ్చిన వారు గతంలో గ్రావెల్ దందాలో కీలక పాత్ర వహించారని తాజాగా వారు ఇప్పుడు గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నారని అంటున్నారు. ఇక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనపై వచ్చిన ఆరోపణలు నిరాధారమని తేలడంతో.. పార్టీ విధించిన సస్పెన్షన్ ఎత్తి వేస్తారని భావించారు. అయితే అది సాధ్యం కాదని తేలడంతో తిరుగుబాటు బావుటా ఎగరవేయడానికి సిద్ధమవుతున్నారు. ఇందులో బాగంగా ప్రభుత్వం నిర్వహించే ప్రతి కార్యక్రమానికి అధికారుల కంటే ముందుగా హాజరువుతున్నారు.

### ఇన్చార్జ్ వెంట వచ్చిన నరసింహయాదవ్, హేమలత

తాజాగా అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే కార్యక్రమం ముగించిన తర్వాత తిరిగి అదే వేదిక మీద టీడీపీ ఇన్చార్జ్ శంకర్ రెడ్డి, జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు అయిన నరసింహాయాదవ్ తిరిగి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే హేమలతతో పాటు అధికారులు పాల్గొన్నారు. 15వతేదిన స్వాతంత్ర దినోత్సవం నాడు ఎమ్మెల్యే ఆదిమూలం సాయంత్రం వరకు సత్యవేడు లో వేయిట్ చేసిమరీ స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించారు. అయితే అప్పటికే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి సిద్దమైన శంకర్‌రెడ్డి కి అది ఇబ్బందిగా మారింది. అయితే ఎమ్మెల్యే మాత్రం స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించి తాను ప్రజాప్రతినిధిని అని ప్రభుత్వ కార్యక్రమాలలో తనకు ప్రాధాన్యత ఉంటుందని దాన్ని ధిక్కరిస్తే ప్రివిలేజ్ కమిటికి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించి టీడీపీ శ్రేణులకు షాక్ ఇచ్చారు. జడ్పీ సమావేశాలలో సైతం ఆదిమూలం ఇదే ధోరణిలో మాట్లాడాడు..అధికారులు తనకు కనీస సమాచారం ఇవ్వడం లేదని కార్యక్రమాలకు అహ్వానం పలకడం లేదని దీనిపై తాను పోరాటానికి సిద్ధమని హెచ్చరించారు.

### శంకర్‌రెడ్డికి తలనొప్పిగా మారిన ఆదిమూలం వైఖరి

మొత్తానికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వైఖరి సత్యవేడులో టీడీపీ ఇన్చార్జ్ శంకర్రెడ్డికి తలనొప్పిగా మారిందంట. ప్రతిచోటా ఎమ్మెల్యే ముందుగా హాజరవుతుండటంతో అయనకు ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొందంట. మరో వైపు రాష్టంలో క్లిష్ట పరిస్థితి ఎదుర్కుంటున్న వైసిపి ఆదిమూలంతో టచ్ లోకి పోయిందని అంటున్నారు. ముందుగా నియోజక వర్గంలోని దళిత వాడలనుంచి స్పందన వచ్చే విధంగా వాయిస్ వినిపించడానికి ఆదిమూలం బ్యాచ్ సిద్ధమైందంట. సత్యవేడు రిజర్వుడు నియోజకవర్గం కాబట్టి మీరు ఇన్ చార్జ్‌ను పెట్టారు.. మిగతా చోట్ల ఇలాంటి పరిస్థితి ఉందా అంటు ఇప్పటికే వైసిపి నుంచి ఆదిమూలంతో పాటు టిడిపిలోకి వచ్చిన వారంతా మాట్లాడుతున్నారు.

### తన వర్గీయులకే ప్రాధాన్యత ఇస్తున్న శంకర్‌రెడ్డి

ఆదిమూలం నుంచి తమ అపరేషన్ ప్రారంభించి స్థానిక సంస్థల ఎన్నికల నాటికి ఎదో ఒక హాడావుడి చేయడానికి వైసీపీ ప్లాన్ చేస్తుందంట. దీంతో పాటు శంకర్ రెడ్డి వ్యవహార శైలి కూడా ఇందుకు కారణమవుతుందని అంటున్నారు. శంకర్‌రెడ్డి నియోజకవర్గంలో తన సామాజిక వర్గానికి పెత్తనం అప్పగించారని టీడీపీ శ్రేణులు అంటున్నాయి. మొత్తం మీద ఇప్పటికైనా సత్యవేడు మీద అధిష్టానం దృష్టి సారించక పోతే మొత్తానికి నష్టపోయే పరిస్థితి ఉందని అంటున్నారు చూడాలి మరి ఏం జరుగుతుందో..

# రంగులు మారుతున్న రాజకీయాలు

హైదరాబాద్, రాజకీయాలు అందరికీ ఒక పట్టానా అర్థం కానీ బ్రహ్మ పదార్థం. ఈ రంగంలో రోజు, రోజుకు మార్పులు చోటుచేసుకుంటున్నాయి. నాటకంలో ఒక ఎపిసోడ్ ముగిసిందనుకునే లోపు మరో ఎపిసోడ్ కు తెర లేవడం జరుగుతూనే ఉంది. అలాగే అన్ని పార్టీల్లో ఒకేవిధమైన సమస్య పొడసూపడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వీటిలో కొన్నిటికి నాయకులు కారణమైతే, మరికొన్ని పరిస్థితులు కారణమవుతాయి. పరిస్థితులు ఎప్పుడూ ఏ విధంగా మార్పులు చెందుతాయో అర్థం కానీ పరిస్థితి.గడిచిన ఏడాది కాలంలో పరిస్థితి వేరు. ఈ నెల రోజుల్లో మారిన సమీకరణాలు వేరు. ఒక్కో ఇష్యూ తెరమీదకు వచ్చి అట్టే మాయమైపోతున్న తీరు పరికిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఎంత త్వరగా మార్పులు సంభవిస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ ఏర్పడిన తరువాత మొట్టమొదటిసారిగా అధికారానికి వచ్చిన కాంగ్రెస్ ను ఏవిధంగా ముప్పుతిప్పలు పెడదామని చేసిన ప్రయత్నాలు వారికే చుట్టుకొని, చివరికి వారి సమస్యలు వారే పరిష్కరించుకునేందుకే తలప్రాణం తోకకు వచ్చినట్లయింది. పదేళ్లు పాలించిన ప్రభుత్వం, తమకు ఎదురులేదని, తాము తప్ప ఈ రాజ్యాన్ని పాలించే అర్హత ఎవరికి లేదని, ప్రజలకు వేరే ప్రత్యామ్నాయం లేదని విర్రవీగుతున్న సమయంలో, ఎవరూ ఊహించని ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. అధికార మత్తులో జోగుతున్న అప్పటి ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో తమ ప్రభుత్వంపై విశ్వాసం రోజు రోజుకు తిరిగిపోతున్నది అనే వాస్తవాన్ని గ్రహించలేకపోయారు. ఒకటి, రెండు రాజకీయ మార్పులు సూచనప్రాయంగా కనిపించినా, వాటిని పట్టించుకోలేదు. పర్యవసానంగా వెళ్ళూనుకొని ఉన్న భారీ వృక్షం ఒక్క గాలివానకు పడిపోయినట్లు పార్టీ కకావికలమైంది. ఆ వృక్షాన్ని నమ్ముకొని గూళ్లు కట్టుకొని జీవిస్తున్న కొన్ని పక్షులు విపత్తును ముందే గ్రహించి వేరే వృక్షాన్ని ఆశ్రయించగా, పసిగట్టలేని కొద్దిమంది మాత్రం అలాగే ఉండిపోయి పడిపోయిన శకలాలు మళ్ళీ జీవం పోసుకుంటాయేమోనని ఆశగా ఎదురుచూస్తున్నాయి.ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాన్ని అస్థిర పర్చడానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోగా, వారికే భూమరంగ్ అవుతున్నాయి. పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు, కార్యకర్తలను, నాయకులను కార్యోన్ముఖులను చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. సమస్యల మీద సమస్యలు చుట్టుముట్టడంతో పాటు ఇంటిపేరు పెద్దాయనకు తలనొప్పిగా పరిణమించింది. పార్టీలో పెద్దాయన తరువాత తామే అంటూ ప్రత్యక్షంగా ఇద్దరు, పరోక్షంగా నలుగురు ఆధిపత్యం చెలాయించేందుకు పోటీపడుతుండడంతో పెద్దాయన వారిని ఏవిధంగా సంజాయించాలనే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. అధికారంలో ఉండగా చిన్న సమస్యలుగా వీటిని గోటితో తీసివేసిన పెద్దాయనకు అధికారం కోల్పోయిన మరుక్షణం ఈ సమస్యలే పెనుభూతాలుగా మారాయి.ఇలాంటి పరిస్థితుల్లో ఏవిధంగా మంత్రాంగం చేయాలనే విషయంలో పెద్దాయన ఫాంహౌస్ నుంచి సంధిస్తున్న ఒక్కో అస్త్రం కొద్దిదూరం ప్రయాణించి లక్ష్యాన్ని చేరుకునే లోపే అంతర్థానం అవడం కనిపిస్తోంది.లిక్కర్ కేసులో జైలుకు వెళ్లివచ్చిన తరువాత వ్యక్తిగతంగా ప్రజల్లోకవిత ప్రాభవం ఈమేరకు ఉందని పెద్దాయన పరీక్షించేందుకు చేసిన ప్రయత్నం పార్టీలో వేరేలా ప్రకంపనలకు దారితీసింది. జాగృతి పేరుతో కవిత దూకుడు పార్టీలో కొత్త సమస్యలను తెచ్చిపెట్టింది. కొన్ని విషయాలపై పార్టీ నాయకులన్నా ముందే స్పందించడం, కార్యక్రమాల నిర్వహణతో కంటిగింపయ్యింది. ఒక దశలో పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లుగా భావించే ఒకరిద్దరు నాయకులపై చేసిన వ్యాఖ్యలు గందరగోళ పరిస్తితులకు దారితీశాయి. పార్టీ వీడి కొత్త కుంపటి పెట్టే అవకాశాలున్నాయని కూడా ఊహాగానాలు ఊపందుకున్నాయి.

### అటకెక్కిన దీక్షలి



బీసీ రిజర్వేషన్లపై ఏకంగా 72 గంటల దీక్ష చేస్తానని ప్రకటించిన కవిత 24 గంటలు కాకముందే అకస్మాత్తుగా దీక్ష విరమించుకోవడం వెనుక పెద్దాయన ఆదేశాలున్నట్లు వార్తలు వచ్చాయి. అన్న చెల్లెళ్ళు రాఖీతో నైనా ఏకం అవుతారని భావించిన ఆ పార్టీ నాయకులు నిరాశకు గురయ్యారు. ప్రతీరోజు ఏదోవిధంగా వార్తల్లో వ్యక్తిగా మైలేజ్ అందుకున్న కవిత ఒక్కసారిగా మౌనం వహించడానికి కారణాలు ఏమై ఉంటాయనే విషయంలో చర్చ ఊపందుకుంది. ఆ తరువాత కొడుకు చదువుల కోసం 15 రోజులు అమెరికా ప్రయాణం పెట్టుకున్న కవిత తిరిగి వచ్చే వరకు పరిస్థితిపై వివిధ రకాలుగా చర్చించుకుంటున్నారు.

### అటు కాంగ్రెస్ లో..

మంత్రి పదవి కోసం అంగలారుస్తూ నోటికి వచ్చిందలా మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వివాదం ఇంకా కొనసాగుతూనే ఉంది. రోజు, రోజుకు కొత్త రకం గళం విప్పుతున్న కోమటిరెడ్డి ఎపిసోడ్ ఎలా ముగుస్తుందని చర్చ కాంగ్రెసులో అంతర్గతంగా జరుగుతోంది. కానీ ఒక్క అన్న తప్ప ఎవరూ ఈ విషయంలో నోరు మెదపడం లేదు. కోమటిరెడ్డి కి మంత్రి పదవి ఇచ్చి ఊకోబెడతారా.? లేక ఆయనే విసిగిపోయి ఊకుంటారా..? అని కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది.

### గువ్వల ఎపిసోడ్

కేసీఆర్ కు అనుంగు అనుచరుడైన అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఎటు వెళ్తాడో అనే ఎపిసోడ్ మాత్రం వారం రోజులు షేక్ చేసింది. బిఆర్ఎస్ కు రాజీనామా చేసిన "గువ్వ"ల ఏ గూటికి చేరుతుందో అనే విషయంలో చర్చ ఊపందుకుంది. చివరకు ఊహించినట్లుగానే బీజేపీ లో చేరడంతో ఆ ఎపిసోడ్ కు తెరపడింది.

### బీజేపీ లో కూడా అదే తంతు..

బీజేపీలో అధ్యక్ష ఎన్నికలు పార్టీలో విభేదాలను బహిర్గతం చేశాయి. కట్టర్ హిందుత్వ వాది ఆయన రాజా సింగ్ ఈ పరిణామాలతో పార్టీకి రామ్.. రామ్ చెప్పాల్సివచ్చింది. బయటికి వచ్చిన రాజసింగ్ మళ్లీ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నా ఫలితం లేకపోవడంతో ఆయన అటు కాంగ్రెస్, బీఆర్ఎస్ లో చేరలేక, ఇటు బీజేపీకి దూరమై ఏకాకిగా మిగిలిపోయాడు.అధికార పార్టీ నుంచి ప్రతిపక్షాల వరకు అన్ని పార్టీల్లో బేధాభిప్రాయాలు, అభిప్రాయ బేధాలు పొడసొపుతూనే ఉంటాయి. కొన్ని వాటంతట అవే సద్దుమణుగుతాయి. కొన్ని నాయకత్వ చొరవతో పరిష్కారమవుతాయి. ఏదోవిధంగా వార్తలకు ఎక్కాలని, ప్రతీ రోజు తనపేరు మారుమోగాలని ఒకటి, రెండు మీడియాలో కామెంట్ చేయడం, సోషల్ మీడియాలో వైరల్ కావడం, వాటిపై విశ్లేషణలతో హైలైట్ కావడం, వాటిని ఆధారంగా చేసుకొని ప్రత్యేక ఇంటర్వ్యూలు ప్రసారం చేయించుకొని తమకుతామే పెద్ద నాయకుడిగా ఊహించుకోవడం పరిపాటిగా మారింది. తద్వారా కొన్ని పెయిడ్ మీడియా వ్యవస్థలు సొమ్ము చేసుకునేందుకు ఉపయోగించుకుంటున్నాయి.

# వర్షాలతో భారీగా నష్టపోయిన రైతులు

గుంటూరు,రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో 1.50 లక్షల ఎకరాల్లో వరి పైర్లకు నష్టం వాటిళ్లగా ఇందులో గుంటూరు జిల్లాలో 70 వేల ఎకరాల్లో పంట నీట మునిగింది. ఇప్పటి వరకు అధికారులు ఎటువంటి ఎన్యూమరేషన్ ప్రక్రియ చేపట్టలేదు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రతి ఏటా పొలాలు ముంపునకు గురికావడం, రైతులు తీవ్ర నష్టాలపాలవడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో రైతులు పంటను కోల్పోయి ఎటూ పాలుపోని స్థితిలో ఉన్నారు. కృష్ణా పశ్చిమ డెల్టాలో ఈ ఏడాది అన్నదాతలకు ఆదిలోనే కష్టాలు ప్రారంభమయ్యాయి. వరిసాగు చేసిన రైతులు ఇప్పటి వరకు రెండుసార్లు వెదపద్ధతిలో విత్తనాలు చల్లగా ఒకసారి వర్షాభావం నష్టం వల్ల , రెండో విడత అతి భారీ వర్షాల కారణంగా పెట్టబుడులు దెబ్బతీశాయి. పంట ఎదుగుదల దశలో వైపరిరీత్యాల వల్ల ఎకరాకు ఒక్కో రైతు రూ.20 వేల వరకు నష్టపోయారు. ఈ నెల 12, 13 తేదీల్లో కురిసిన అతి భారీ వర్షం వల్ల జిల్లాలోని దాదాపు లక్ష ఎకరాల్లో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. ఇప్పటికే రెండుసార్లు నష్టపోయిన రైతులు మూడోసారి వెదపద్ధతిలో సాగుకు అవకాశాలు లేవని, ఇప్పుడు నాట్లు వేయాలన్నా నారు అందుబాటులో లేదని వాపోతున్నారు. నారుమడులు పోసి నారు తయారు కావాలన్న కనీసం 30 రోజులు సమయం పడుతుందని ఈ లోగా అదునుదాటిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా పశ్చిమ డెల్టాలో తొలి పంటగా వరి సాగు, రెండో పంటగా జొన్న, మొక్కజొన్న సాగు చేయడం ఆనవాయితీ. ఈ ఏడాది అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల పంటను ప్రాథమిక దశలోనే కోల్పోయారు. ప్రధానంగా తెనాలి డివిజన్‌లోని కొల్లిపర, దుగ్గిరాల, పెదకాకాని, మంగళగిరి, తాడేపల్లి, చేబ్రోలు, పొన్నూరు తదితర మండలాల్లో కురిసిన అధిక వర్షాలకు పైరు నీట మునిగి ఎందుకూ పనికిరాకుండాపోయింది. వరితో పాటు- కూరగాయలు, ఆకుకూరల తోటలు దెబ్బతిన్నాయి. పసుపు, కంద పంటలు నీట మునిగాయి. గుంటూరు ఛానల్‌కు గండ్లు పడడం, కొండవీటి వాగు ముంపు వల్ల అధిక నష్టం జరిగింది. కాల్వ కట్టల పటిష్టతపై అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం వల్లే అధిక నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. మూడ్రోజులపాటు- పొలాల్లో రెండు అడుగుల మేరకు నీరు నిల్వ ఉండడం వల్ల పైర్లన్నీ దెబ్బతిన్నాయి. అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలి. ఎకరాకు రూ.20 వేల వరకు ఒక్కో రైతుకు నష్టం వాటిల్లింది. కాల్వల మరమ్మతులు సక్రమంగా జరగపోవడం, పొలాల్లో నీరు బయటకు పోయే అవకాశాలు లేకపోవడం వల్ల పైర్లు నీట మునిగి పూర్తిగా నష్టం జరిగింది.

# పట్టింపు లేని కూటమి ప్రభుత్వం

ఏలూరు,పోలవరం ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన గిరిజనలు రోడ్డున పడ్డారు. గొప్పలు చెప్పుకుంటున్న నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు, గత సిఎం జగన్‌లు వారిని కనీసం పట్టించు కోలేదు. పునరావస సమస్యలు పరిష్కరించలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం కూడా వారిగురించి ఆలోచించడం లేదు. దీంతో వారు నానాయాతన పడుతున్నారు. ఇప్టటికీ పునరావాస కాలనీలో కనీస సదుపాయాలు లేవు. తాగునీటి ట్యాంక్ నిర్మించినా కనెక్షన్ ఇవ్వకపోవడంతో కిలోమీటరు దూరం నుంచి తాగునీరు తెచ్చు కోవాల్సి వస్తోంది. డ్రెయిన్ల నిర్మాణం మధ్యలోనే వదిలేయడంతో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. ఇల్లు నిర్మించి మూడేళ్లు కాకముందే స్లాబుల నుంచి వర్షపు నీరు లీకవుతోంది. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో దోమల బెడద తీవ్రంగా ఉంది. ఇటీవల ఓ యువకుడు జ్వరంతో చనిపోయాడు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అందుబాటులో లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.రేషన్ కార్డు పాత గ్రామంలోనే ఉంది. 90 కిలోమీటర్లు వెళ్లి రేషన్ బియ్యం తెచ్చుకోవాల్సి వస్తోంది. ఆటో ఖర్చులు మనిషికి రూ.300 అవుతున్నాయి. ఆధార్, ఓటర్ కార్డులు మా పాత గ్రామంలోనే ఉన్నాయి. శ్రీరామగిరి నుంచి ఇక్కడికి అర్థాంతరంగా తరలించారు రోడ్లు లేవు. వీధిలైట్లు- వెలగడం లేదు. గర్భిణిని ఆటోలో ఆస్పత్రికి తీసుకువెళ్లాలన్నా అవస్థలు తప్పడం లేదు. మరుగుదొడ్లు తక్కువ ఎత్తులో నిర్మించారు. డోర్లు సొంత ఖర్చులతో ఏర్పాటు-చేసుకున్నాం. దొంగలభయం అధికంగా ఉంది. పునరావాస కాలనీకి ఆవాసం వచ్చినప్పటి నుంచి ఉపాధి లేదు. గతంలో సొంత గ్రామంలో కూలి పనికి వెళ్లే వాడిని. ఇప్పుడు ఈ గ్రామంలో ఆ అవకాశం లేక ఉపాధి కోసం భద్రాచలం వెళ్లాల్సి వస్తోంది. అంగన్‌వాడీ కేంద్రం, ప్రైమరీ స్కూలు లేవు. పిహెచ్‌సి లేదు. వర్షం వస్తే రోడ్లు సరిగా లేక ఎక్కడికీ వెళ్లే పరిస్థితి లేదు. పింఛను కోసం విఆర్.పురం మండలంలోని గొందూరుకు వెళ్లాల్సి వస్తోందని, రాకపోకలకు సుమారు రూ.500 ఖర్చవుతోంది. ఈ ప్రాంతంలోనే పింఛను ఇప్పించాలని కోరారు. మా ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదు. వాటర్ ట్యాంక్ కనెక్షన్ లేదు. కనీస సౌకర్యాలు లేకపోయినా తప్పనిసరై కాలనీలో బతుకీడుస్తున్నారు. నరసింగపేట కాలనీలో ఎవరిని పలకరించినా ఇవే దయనీయ పరిస్థితులు కనిపించాయి. ఈ కాలనీలో విఆర్ పురం మండలం ముంపు ప్రాంతాలైన కొల్లూరు, గొందూరు, శ్రీరామగిరి, కొటారి గుమ్ములకు చెందిన 289 కుటుంబాలకు ప్రభుత్వం ఇక్కడ పునరావాసం కల్పించింది. తాజాగా ఈ సమస్యలను ఆ కాలనీలో సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ, రాజ్యసభ ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్‌లతో కూడిన బృందం ఆదివారం పర్యటించిన సందర్భంగా కాలనీలోని సమస్యలను పలువురు విన్నవించారు. 'అని అదే కాలనీకి చెందిన కోండ్ల శ్రీదేవి ఏకరువు పెట్టారు. వారిని తమ వెంట తీసుకెళ్లి గృహాల దుస్థితిని చూపించారు.

# యూరియా కొరతపై కాంగ్రెస్ వాయిదా తీర్మానం

న్యూఢిల్లీ, దేశవ్యాప్తంగా మరోమారు యూరియా కొరతల ఆందోళన కనిపిస్తోంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. రైతుల క్యూలో నిలబడి యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. అయితే రాష్ట్రంలో గత కొన్ని నెలలుగా యూరియా కొరత తీవ్ర దుమారం రేపుతుంది. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు వివక్షత చూపిస్తూ.. యూరియా ఇవ్వడం లేదని అధికార పార్టీ నేతలు ఆరోపిస్తుంటే.. అధికారంలో ఉన్న నేతలు యూరియాను బ్లాక్‌లో అమ్ముకున్నారని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నాయి. ఏది ఎలా పోయినా.. రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నది వాస్తవం. అది రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్షయమో, కేంద్ర ప్రభుత్వ నిర్లక్షయమో తెలియక రైతులు సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో యూరియా కొరతపై పార్లమెంటు-లో తెలంగాణ కాంగ్రెస్ ఏంపీలు వాయిదా తీర్మానం ఇచ్చారు. వాయిదా తీర్మాన ప్రతిపాదనను లోకసభ సెక్రటరీ జనరల్‌కు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పంపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు తెలంగాణ రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నులు యూరియాను కేంద్రం కేటాయించిందని తెలిపారు. కానీ ఇప్పటి వరకు కేవలం 4.50 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా మాత్రమే సరఫరా చేసిందని చెప్పారు. ఆగస్టు 13వ తేదీ వరకు ఇంకా 6.60 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా రాష్ట్రానికి సరఫరా చేయాల్సి ఉందని చామల పేర్కొన్నారు.

## మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వడం లేదు

హైదరాబాద్,బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడమే లక్ష్యంగా ముస్లిం పేరుతో వాదనలు సృష్టిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మైనార్టీల రిజర్వేషన్లు ఇతర రాష్ట్రాలైన మహారాష్ట్ర, గుజరాత్ ఎలా అమలులో ఉన్నాయో కేంద్రం పరిశీలించాలని, అక్కడ తొలగించే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీపై కోపం ఉంటే రాజకీయంగా ఎదుర్కోవచ్చని, కేసులు పెట్టవచ్చని.. కానీ, ఆయన నమ్మిన బీసీ సాధికారత సిద్ధాంతాన్ని దెబ్బతీయొద్దని సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో బీసీలు ముందుకు రావడం రాహుల్ గాంధీ లక్ష్యమని, ఆ సూచనలను అమలు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం తెలంగాణ సమాజానికి ఆదర్శంగా నిలబడాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ట్యాంక్‌బండ్ సమీపంలో పాపన్నగౌడ్ విగ్రహానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. బహుజనుల సామ్రాజ్యాన్ని అందరికీ ఎలా అందించవచ్చో పాపన్నగౌడ్ నిరూపించారన్నారు. పాపన్నగౌడ్ కోటను గత ప్రభుత్వాలు మైనింగ్ లీజుకు ఇచ్చాయని విమర్శించారు. గతంలో ఖిలాషాపూర్ కోటను కాలగర్భంలో కలపాలని చూశారని దుయ్యబట్టారు. చరిత్ర స్ఫూర్తి కోటను చారిత్రక కట్టడాలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించామన్నారు. భవిష్యత్తు తరాలు స్ఫూర్తి పొందేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. గాంధీ కుటుంబం దేశానికి గొప్ప వరం. శాంతితో యుద్ధాన్ని గెలవవచ్చు అని గాంధీ నిరూపించారు. దేశం కోసం ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ ప్రాణాలర్పించారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సోనియాగాంధీ పదవులు త్యాగం చేశారు. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు ఆ కుటుంబం గొప్ప నాయకత్వాన్ని అందించింది. ప్రపంచ వ్యాప్తంగా భారత్‌ను గుర్తించినట్లే.. గాంధీ కుటుంబాన్ని గుర్తిస్తున్నారు. ఆ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న మన ప్రభుత్వం ప్రపంచానికి ఆదర్శం అన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సర్ధార్ సర్వాయి పాపన్నకు సముచిత గౌరవం ఇవ్వడమే తమ ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. హుస్నాబాద్‌లోని పాపన్న కోటను లీజుకు ఇచ్చిందని, తాము అయితే ఆ కోటను సంరక్షించడానికి చర్యలు ప్రారంభించామని వెల్లడించారు. హుస్నాబాద్ నుంచి పొన్నం ప్రభాకర్‌ను పోటీ- చేయించడం కూడా అదే భావనలోనుంచే జరిగిందని అన్నారు. గాంధీ కుటుంబాన్ని దేశానికి గొప్ప వరంగా అభివర్ణిస్తూ.. వారిచ్చే హామీ శిలాశాసనం లాంటిదేనని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ సూచించినట్లు-గా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ దిశగా రాష్ట్రవ్యాప్తంగా కుల గణనను నిబద్ధతతో పూర్తి చేసామని, తాము చేసిన సర్వేలో తప్పు ఎక్కడ ఉందో చూపించమని అసెంబ్లీలోనే సవాల్ చేశామని ఆయన పేర్కొన్నారు. రిజర్వేషన్ల అమలుకు సంబంధించి తీసుకున్న రాజకీయ, న్యాయ చర్యలను సీఎం వివరించారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో తీర్మానం చేసి రాష్ట్రపతికి పంపినప్పటికీ అది ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉందని చెప్పారు. తాము తెచ్చిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించకుండా రాష్ట్రపతికి పంపించారని, కేంద్ర స్థాయిలో దానికి ఆమోదం వచ్చేలా చూడాల్సిన కేంద్ర నేతలు వాదనలతో కాలం గడుపుతున్నారని ఆక్షేపించారు. 2018లో కేసీఆర్ ప్రభుత్వం చేసిన చట్టమే ప్రస్తుతం 50 శాతం దాటి రిజర్వేషన్లు ఇవ్వడంలో అడ్డంకిగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా మత ప్రాతిపదికన ఏ రిజర్వేషన్లు ఉండవని స్పష్టం చేశారు. తాము పంపిన బిల్లు గానీ, ఆర్డినెన్స్ గానీ మతాధారిత రిజర్వేషన్లను ప్రతిపాదించలేదని సీఎం స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క, మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్, మేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి కోరుకుంటోంది అదే!

హైదరాబాద్,జూనియర్ ఎన్టీఆర్ వర్సెస్ కూటమి అనే పరిస్థితికి తీసుకొస్తున్నారు కొందరు నేతలు. దీనికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు మరింత ఆజ్యం పోస్తున్నారు. జూనియర్ ఎన్టీఆర్ పై అనంతపురం అర్బన్ టిడిపి ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ సోషల్ మీడియాలో ఆడియో వైరల్ గా మారింది. ఇటీవల జూనియర్ ఎన్టీఆర్ నటించిన వార్ 2 చిత్రం విడుదలైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ తెలుగు యువత నాయకుడు గుత్తా ధనుంజయ నాయుడుతో ఫోన్లో జరిపిన సంభాషణ లీక్ అయ్యింది. దీంతో ఒక్కసారిగా జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ లో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. దీంతో అనంతపురం ఉద్రిక్తంగా మారింది. జూనియర్ ఎన్టీఆర్ కు టిడిపి అగ్రనాయకత్వం పెద్దగా సహకరించడం లేదన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే కామెంట్స్ రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీస్తున్నాయి. ఇటీవల ఎన్టీఆర్ సినిమా విడుదల అయింది. ఆ సినిమా ప్రదర్శన విషయంలో అనుచిత వ్యాఖ్యలు చేశారు ఎమ్మెల్యే. అయితే ఆడియో లీక్ కావడంతో.. అది తన వాయిస్ కాదని.. రాజకీయ దురుద్దేశంతో ప్రత్యర్థులు చేసిన పని అంటూ ఎమ్మెల్యే ప్రసాద్ మీడియాకు ఒక వీడియో విడుదల చేశారు. అయినా సరే జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ తగ్గలేదు. అనంతపురంలో ఎమ్మెల్యే ఫ్లెక్సీలను ధ్వంసం చేయడం విశేషం.

**టిడిపి శ్రేణుల్లో భిన్నాభిప్రాయం..**

జూనియర్ ఎన్టీఆర్ విషయంలో తెలుగుదేశం పార్టీలో ఒక భిన్న అభిప్రాయం ఉంది. మొన్నటి ఎన్నికల ముందు వరకు జూనియర్ ఎన్టీఆర్ పార్టీలోకి వస్తే బాగుంటుందని ఎక్కువమంది అభిప్రాయపడ్డారు. కానీ జూనియర్ ఎన్టీఆర్ దగ్గరి వారిగా భావించే కొడాలి నాని, వల్లభనేని వంశీ మోహన్ వ్యవహరించిన తీరు.. వారి విషయంలో జూనియర్ ఎన్టీఆర్ నియంత్రించలేకపోవడం.. చంద్రబాబు అరెస్టు సమయంలో స్పందించకపోవడం.. నారా భువనేశ్వరి పై వైసీపీ నేతల వ్యాఖ్యలను సరైన రీతిలో ఖండించకపోవడం.. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్పు సమయంలో సైతం సరైన రీతిలో కామెంట్స్ చేయకపోవడం వంటి కారణాలతో జూనియర్ ఎన్టీఆర్ పై టిడిపి శ్రేణుల్లో ఒక రకమైన భిన్న అభిప్రాయం ఏర్పడింది. ఎన్నికల్లో గెలిచిన తర్వాత లోకేష్ హవా పెరిగింది. పార్టీతో పాటు ప్రభుత్వంలో ఆయన పట్టు సాధిస్తూ వచ్చారు. అయితే లోకేష్ కు దగ్గర కావాలన్నా ఆలోచనతో ఉన్న నేతలు జూనియర్ ఎన్టీఆర్ పై ఇటువంటి వ్యాఖ్యలు చేస్తూ వచ్చారు. అందులో భాగమే అనంతపురం ఎమ్మెల్యే వ్యాఖ్యలు అంటూ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**రాజకీయాలకు దూరంగా..**

అయితే ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల జోలికి వెళ్లడం లేదు. సినిమాలపైనే పూర్తిగా ఫోకస్ పెట్టారు. పాన్ ఇండియా స్థాయికి ఎదిగారు. ఆర్ఆర్ఆర్ సినిమా వచ్చిన తర్వాత జూనియర్ ఎన్టీఆర్ క్రేజ్ అమాంతం పెరిగింది. దానిని రక్షించుకునే పనిలో ఉన్నారు జూనియర్ ఎన్టీఆర్. ఎటువంటి రాజకీయ వేదికలపై కానీ.. ఎటువంటి రాజకీయ వ్యాఖ్యలు కానీ చేయడం లేదు. వివాదాస్పదం అయ్యే వాటి విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటున్నారు. చాలా రకాలుగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తన సొంత సోదరి ఎన్నికల్లో పోటీ చేసినా ఎటువంటి ప్రకటన చేయలేదు. అదే సమయంలో ఏపీ ప్రభుత్వ పెద్దల నుంచి సైతం ఎన్టీఆర్ కు ఎటువంటి ఇబ్బందులు లేవు. జూనియర్ ఎన్టీఆర్ తో విభేదాలు లేవని.. మంచి సంబంధాలే ఉన్నాయని లోకేష్ చెబుతుంటారు. చాలా సందర్భాల్లో లోకేష్, జూనియర్ ఎన్టీఆర్ పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు. శుభాకాంక్షలు చెప్పుకున్న సందర్భాలు కూడా అధికం.

**ఫ్యాన్స్ ముసుగులో వైసిపి..**

అయితే టిడిపి ఎమ్మెల్యే వ్యవహార శైలి అభ్యంతరకరంగా ఉంది.

# తిరుపతిలో టీడీపీకి దిక్కెవరు?



తిరుపతి: తిరుపతి నియోజకవర్గంలో అడుగడుగునా అధికార పార్టీలో నాయకత్వ లోపం కనిపిస్తుంది. దాంతో ప్రత్యర్థులు ఇష్టాను సారం వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏడాది కాలంగా వైసీపీ చోటామోటా నేతలతో కూటమి చోటా నేతలు కలసి కట్టుగా కలసి దందాలు చేస్తున్నారంటే అక్కడ నాయకత్వ లోపం కనిపిస్తోందంటున్నారు. తాజాగా వైసీపీకి చెందిన చైతన్య యాదవ్, అజయ్ రెడ్డి దందాలే అందుకు నిదర్శనం అంటున్నారు. అసలింతకీ తిరుపతిలో ఏంజరుగుతుంది? టీడీపీ అధిష్టానం ఇంకా అక్కడ పార్టీకి ఎందుకని రిపేర్లు చేయడం లేదు?

**తొలిసార తిరుపతి నుంచి పోటీ చేసి గెలిచిన ఎన్టీఆర్**

రాష్టంలో అత్యంత కీలక మై న నియోజకవర్గం తిరుపతి. టీడీపీ ఆవిర్భావం తర్వాత నందమూరి తారక రామారావు తిరుపతి నుంచి పోటీ చేసి గెలిచి ఆ స్థానానికి సెంటిమెంట్ వాల్యూ పెంచారు.తర్వాత ప్రజా రాజ్యంలో సైతం మెగా స్టార్ చిరంజీవి ఇక్కడ నుంచి పోటీ చేసి విజయం సాధించి రాజకీయ అరంగ్రేటం చేసారు. అయితే స్థానికంగా ఉన్న నాయకత్వ లేమి, గ్రూపు విభేదాలతో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తిరుపతి నుంచి పోటీ చేయడానికి వెనుకాడారన్న అభిప్రాయం ఉంది. గత ఎన్నికల సమమయంలో టీడీపీలో తిరుపతి సీటు కోసం పెద్ద ఎత్తున పోటీ నెలకొంది.

**గ్రూప్‌వార్ తట్టుకోలేక జనసేనకు టికెట్ కేటాయించిన చంద్రబాబు**

తిరుపతి నేతల గ్రూపు వార్‌తో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు గత ఎన్నికల్లో ఆ సీటు జనసేనకు కేటాయించారు. జనసేన లో సైతం పాతకాపులు కాకుండా చిత్తూరు నుంచి వచ్చిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు టికెట్ దక్కించుకుని తిరుపతిలో ఇప్పటి వరకు ఎవరూ సాధించని మెజార్టీతో గెలుపొందారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఇప్పటికి కూటమిలో ముఖ్యంగా టీడీపీ నాయకత్వంలో మార్పు రాలేదు. అధికారంలో ఉన్నమనే దర్పం కనిపించడం లేదు. ఇన్చార్జ్‌గా మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ బ్యూటిఫికేషన్ అండ్ గ్రీనరి కార్పోరేషన్ చైర్మన్ అయ్యారు. అమెను తెలుగు తమ్ముళ్లు అసలు పట్టించుకోవడమే లేదంట.

**తిరుపతికి నాలుగు నామినేటెడ్ పదవులు ఇచ్చిన టీడీపీ**

మరో వైపు తిరుపతి నగరానికి సంబంధించి రాష్ట స్థాయి కార్పొరేషన్ పదవులు నాలుగు దక్కాయి. శాప్ చైర్మన్ రవి నాయుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహా యాదవ్, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, గ్రీనరి అండ్ బ్యూటిపికేషన్ చైర్మన్‌గా సుగుణమ్మలకు టీడీపీ అధిష్టానం అవకాశం కల్పించింది. ఇక డైరెక్టర్ లుగా అనేక మంది కి అవకాశం కల్పించారు. వారిలో టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ గా విజయ్‌కుమార్ కు అవకాశం కల్పించారు.

**యాక్టివ్ రాజకీయాల్లో కనిపించని తిరుపతి టీడీపీ నేతలు**

గత ఎన్నికల్లో తిరుపతి టీడీపీ టికెట్ అశించిన వారిలో జేబీ శ్రీనివాస్, మబ్బు దేవ నారాయణరెడ్డి , డాక్టర కోడూరి బాలు ఉన్నారు. వీరితో పాటు హడావుడి నాయకులు తిరుపతి టీడీపీలో చాలా మందే ఉన్నారు. అయితే ప్రస్తుతం వారిలో యాక్టివ్ రాజకీయాలు ఎవ్వరు చేయడంలేదు. క్షేత్ర స్థాయి కార్యకర్తల సమస్యలు తెలుసుకునేవారే కరువయ్యారు. గ్రూపుల గోల కొనసాగుతూనే ఉంది. ఆ క్రమంలో నామినేటెడ్ పదవి దక్కించుకున్న సుగుణమ్మను పార్టీ తిరుపతి ఇన్చార్జ్‌గా మార్చి త్రీ మెన్ కమిటి వస్తుందని తెలుగు తమ్ముళ్లు అశిస్తున్నారు. కాని పార్టీ అధిష్టానం ఇవేమి పట్టించేకోవడం లేదంట. దీంతో పార్టీ క్యాడర్ నిరాశ నిస్పృహల్లోకి వెళుతుంది..

**కార్పొరేషన్ ఎన్నికలకు క్యాడర్‌ను సిద్ధం చేస్తున్న వైసీపీ**

టీడీపీలో పరిస్థితిని ఆసరా చేసుకుని తిరుపతిలో వైసీపీ దూకుడు పెంచి వచ్చే నగర పాలక సంస్థ ఎన్నికలకు క్యాడర్ ను సమాయత్తం చేస్తుంది. తిరుపతి వైసీపీ మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, అయన కూమారుడు తిరుపతి ఇన్చార్జ్ అభినయ్ రెడ్డిలు తెలుగుతమ్ముళ్లపై మైండ్ గేమ్ మొదలు పెట్టారంటున్నారు. తమ అనుచరుల వ్యాపారాలలో కొంతమంది టిడిపి వారికి వాటా కల్పించి సమస్యలు లేకుండా సెట్ రైట్ చేసుకుంటున్నారంట. దానికితోడు తమ వారిని కొంతమందిని జనసేనలోకి పంపించారనే ప్రచారం జరుగుతోంది. రాష్టంలో ఎక్కడా లేని స్థాయిలో వైసీపీ నేతలు ప్రభుత్వంపై దాడి ప్రారంభించారు. దీంతో పాటు టీటీడీ అధికారులు, పాలక మండలిపై వారు విమర్శలు చేయడం మొదలు పెట్టారు. గోశాల ఇష్యూ రాష్ట వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. గత ఎన్నికల్లో తిరుపతి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన భూమన అభినయ్‌రెడ్డి కూడా వాగ్ధానాల అమలు కావడం లేదంటూ హడావుడి చేస్తున్నారు. అయితే టిడిపి నేతలు మాత్రం ఇందంతా పోలీసులు వైఫల్యం అంటు పార్టీ ప్రధాన కార్యాలయానికి పోటోలు పంపడం తప్ప ఎదురు దాడి చేయడం లేదు.

**కారు డెకార్స్ యాజమానిపై చైతన్యయాదవ్ దాడి**

రెండు నెలల క్రితం అభినయ్ రెడ్డి అనుచరుడు అయిన చైతన్య యాదవ్ ఓ కారు డెకార్స్ యాజమానిపై దాడి చేసాడు. ఆ కేసులో హైకోర్టు ద్వారా ఉరట పొందాడు. అయితే పోలీసులు సీరియస్ గా వ్యవహారించి అతనిపై రౌడీషీట్ ఓపెన్ చేసారు. తాజాగా భూమన అనుచరుడు , వైసిపి సోషల్ మీడియా ఇన్చార్జ్ అనిల్ రెడ్డి వ్యవహారం పెద్ద కలకలమే రేపింది. పవన్ అనే ఎస్సీ యువకుడిని తన కార్యాలయంలో బంధించి, కొట్టించి తర్వాత వారి తల్లితం డ్రులతో బేర సారాలు అడి వదిలేశారు. అయితే సదరు దాడి వీడియో బయటక వచ్చిన వెంటనే పోలీసులు సీరియస్ యాక్షన్ తీసుకున్నారు. రాత్రికి రాత్రే అనిల్ రెడ్డితో పాటు జగదీష్ రెడ్డి అనే వ్యక్తిని ఏకంగా మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ఇంటి వద్ద అదుపులోకి తీసుకున్నారు. దళిత యువకుడిపై దాడి చేసిన నిందితులు దినేష్, అజయ్ కూమార్ అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. దానిపైన హొంమంత్రి అనితతో పాటు ఇన్చార్జ్ మంత్రి సత్యకూమార్, శాప్ చైర్మన్ రవినాయుడు స్పందించిన తర్వాత అప్పుడు తిరుపతి పార్లమెంటరీ అధ్యక్షుడు నరసింహయాదవ్ స్పందించారు. అయితే తిరుపతి టీడీపీ ఇన్చార్జ్ సుగుణమ్మ కాని ఇతర నాయకులు ఎవ్వరు మాట్లాడటం లేదు. వైసిపి సోషల్ మీడియా మాత్రము నిందితుడు దినేష్ జనసేన కార్యకర్త అంటుంటే సాయంత్రానికి తీరిగ్గా జనసేన నేతలు స్పందించారు. అయితే ఈ ఇష్యూలో తిరుపతి టీడీపీ నేతలు సమర్థంగా ఎదురు దాడి చేయలేదనే విమర్శలు ఉన్నాయి..

## ఉక్రెయిన్ ఇప్పుడు ఎలా ఉందంటే!?

వాషింగ్టన్:రష్యా, ఉక్రెయిన్ మధ్య మూడు సంవత్సరాలకు పైగా సాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీపై అంతర్జాతీయంగా ఒత్తిడి పెరుగుతోంది. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఈ ఒత్తిడిని మరింత పెంచాయి. ట్రంప్ తన ట్వీట్లలో, జెలెన్స్కీ కోరుకుంటే యుద్ధాన్ని వెంటనే ముగించగలరని, అందుకు క్రిమియా, నాటో సభ్యత్వంపై ఆశలు వదులుకోవాలని పేర్కొన్నారు.

**ఉక్రెయిన్ ముందున్న సవాళ్లు**

ఈ వ్యాఖ్యలు జెలెన్స్కీకి ఒక పెద్ద సవాలుగా మారాయి. ఒకవైపు తన దేశ సార్వభౌమత్వాన్ని కాపాడాలని, రష్యా ఆక్రమించిన ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలని జెలెన్స్కీ కోరుకుంటున్నారు. మరోవైపు, యుద్ధం కొనసాగితే ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థ, సైనిక నష్టం మరింత పెరుగుతాయని, అమెరికా సహాయం కూడా ఆగిపోయే ప్రమాదం ఉందని ఆయనపై ఒత్తిడి ఉంది. ట్రంప్ మాట వినకుంటే భవిష్యత్‌లో అమెరికా నుంచి అందే ఆయుధ, ఆర్థిక సహాయ నిలిపివేసే అవకాశం ఉంది. ఈ పరిస్థితి జెలెన్స్కీ మెడపై కత్తిగా ఉంది. అటు యుద్ధం కొనసాగించలేదు. ఇటు క్రిమియాను ఒదులు కోలేదు. భూభాగాన్ని వదులుకోవడం అంటే దాదాపు యుద్ధంలో ఓడిపోయినట్లే దీంతో ఉక్రెయిన్ దీర్ఘంగా ఆలోచిస్తోంది. 2022 ఫిబ్రవరి నుంచి జరుగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్ పెద్ద దేశమైన రష్యాకు ధీటుగా పోరాడుతున్నా.. ఆ దేశం చాలా కోల్పోయింది. దాదాపు 3లక్షల సైన్యం ప్రాణాలు వదిలింది. బిలియన్ డాలర్ల ఆస్తి నష్టం వాటిల్లింది. పరిస్థితి ఇలాగే ఉంటే ఉక్రెయిన్ ఇంకా చాలా కోల్పోడానికి సిద్ధంగా ఉండాలి. జెలెన్స్కీ ట్రంప్ సూచించిన రష్యా ప్రతిపాదనలను తిరస్కరించారు. ఏ భూభాగాన్ని వదులుకోవడానికి తమ రాజ్యాంగం అనుమతించదని, అలా చేయడం రష్యాకు మరింత ప్రోత్సాహం ఇచ్చినట్లవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో యూరోపియన్ దేశాల మద్దతును కూడగట్టడానికి ఆయన ప్రయత్నిస్తున్నారు. అయితే, శాంతిని స్థాపించాలనే అమెరికా వైఖరి, ముఖ్యంగా ట్రంప్ పట్టుదల, జెలెన్స్కీని ఒక సంక్లిష్టమైన స్థితిలో పడేసింది. క్రిమియా, డాన్‌బాస్ ప్రాంతాలను రష్యాకు అప్పగించేందుకు ఉక్రెయిన్ అంగీకరిస్తే, శాంతి ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ట్రంప్ వర్గాలు సూచించాయి.

**జెలెన్స్కీకి రాజకీయ సవాళు**

కొన్ని అంతర్జాతీయ నివేదికల ప్రకారం, ఉక్రెయిన్, రష్యా, అమెరికా మధ్య త్రైపాక్షిక సమావేశం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన కూడా వచ్చింది. ఈ చర్చల్లో క్రిమియా, డాన్‌బాస్ ప్రాంతాల భవిష్యత్తు గురించి నిర్ణయం తీసుకోవాల్సి వస్తుంది. జెలెన్స్కీ ఈ చర్చలకు సిద్ధంగా ఉన్నప్పటికీ, తన దేశ ప్రయోజనాలను వదులుకోవడానికి సిద్ధంగా లేరని స్పష్టం చేశారు. ఏదేమైనా, జెలెన్స్కీకి తన దేశ ప్రజలు, అంతర్జాతీయ మద్దతుదారుల మధ్య ఒక సమతుల్యతను సాధించాల్సిన అవసరం ఉంది. ఇది ఒక సున్నితమైన రాజకీయ సవాలుగా మారింది, దీని పరిష్కారం యుద్ధం ముగింపుపై నేరుగా ప్రభావం చూపుతుంది.

**యూరోపియన్ మిత్రదేశాల మద్దతు కోసం**

జెలెన్స్కి ఈ విషయంలో యూరోపియన్ దేశాల మద్దతును కోరుతున్నారు. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాల నాయకులు ఉక్రెయిన్‌కు తమ పూర్తి మద్దతును పునరుద్ఘాటించారు. అయితే, శాంతిని స్థాపించాలనే అమెరికా వైఖరి, ముఖ్యంగా ట్రంప్ పట్టుదల, జెలెన్స్కీని సంక్లిష్ట పరిస్థితిలో పడేసింది. క్రిమియా, నాటో వంటి కీలక విషయాలలో వెనకడుగు వేయకుండా, రష్యాను వెనక్కి నెట్టడం జెలెన్స్కీకి ఒక సవాలుగా మారింది. ఈ పరిస్థితుల్లో, జెలెన్స్కీ రాజకీయ భవిష్యత్తు కూడా ఈ యుద్ధం ముగింపుపై ఆధారపడి ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# నిర్లక్ష్యం 'కుండపోత'.. గ్రేటర్ హైదరాబాద్‌కు వాన గండం

హైదరాబాద్,ఉస్మానియా విశ్వవిద్యాలయ భవన సముదాయాలు ఆధునికతకు అద్దం పట్టేలా, తరతరాలు గుర్తుంచుకునేలా ఉండేందుకు నిజాం రాజు ఎంతో ముందు చూపుతో వ్యవహరించారు. నిపుణులైన వారితో కమిటీ వేసి, ఆరేడు దేశాలకు పంపించి, అక్కడి విశ్వ విద్యాలయాల నిర్మాణ శైలి ఎలా ఉందో పరిశీలించి నివేదించాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరానికి వరదలు వచ్చి వేల మంది ప్రాణాలు కోల్పోతే చలించిన నిజాం రాజు.. వరద ముప్పు నుంచి పౌరులను కాపాడేందుకు మహత్తర నిర్ణయం తీసుకుని అమలుపరిచారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ప్రత్యేకంగా పిలిపించి జంట జలాశయాలను నిర్మించి, ఎగువ ప్రాంత వరదలకు అడ్డుకట్ట వేశారు. ఆయనకు ఉన్న ముందు చూపు, దార్శనికత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేనే లేదని, ప్రస్తుతం పాలిస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి అంతకన్నా లేదని నగర పౌర సమాజం విమర్శిస్తున్నది. నగరంపై కుండపోత వానల కంటే.. ప్రభుత్వం కుండపోతలా కురిపిస్తున్న నిర్లక్ష్యంతోనే నగరం నానా అవస్థలు పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. గ్రేటర్ హైదరాబాద్ కోట మందికిపైగా నివసిస్తున్న నగరం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని ఆర్జించి పెడుతూ, ఎక్కడి నుంచి వచ్చినవారికైనా ఉపాధి కల్పిస్తున్న మహా నగరం. దీనిపై తెలంగాణ ప్రభుత్వ పెద్దలకు స్పష్టమైన అవగాహనతోపాటు.. కనీస దూరదృష్టి లేదన్న విమర్శలు చాలా కాలం నుంచే ఉన్నాయి. దున్నపోతు ఈనింది అంటే దూడను కట్టేయండనే తీరుగా ప్రభుత్వ పెద్దలు వ్యవహరిస్తున్నారనే అభిప్రాయాలు గట్టిగానే వినిపిస్తున్నాయి. 'హైదరాబాద్ నగరం న్యూయార్క్ నగరాన్ని మించిపోయిందని ఎవరైనా సెలెబ్రేటీ చెబితే వెంటనే తమ భజన బృందంతో సోషల్ మీడియాలో రంగురంగుల వీడియోలు, ఫొటోలతో ప్రచారం చేయించుకుంటారు. పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తే తమ చలవేనని గొప్పలు చెప్పుకుంటారు. కానీ చిన్నపాటి వర్షానికి రోడ్లన్నీ జలమయం అయి ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోతే పరిష్కారానికి శాశ్వత చర్యలు తీసుకోరు. వర్షం వస్తే రోడ్లపై నిలువ ఉంటాయని, చెరువులు, నాలాలు కబ్జా కావడంతోనే ఈ దుస్థితి వచ్చిందంటూ దానిపై నెట్టేసి తమ బాధ్యతల నుంచి తప్పుకుంటారు' అని ఒక పౌరుడు తన ఆవేదన వ్యక్తం చేశాడు. గత నాలుగు దశాబ్దాలుగా ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న గ్రేటర్ హైదరాబాద్ లో ప్రధాన సమస్యలు ఏంటీ, ఏ సమస్యకు ప్రాముఖ్యత నివ్వాలి, ఎలా పరిష్కరించాలనే దానిపై పాలకులకు స్పష్టత, దీర్ఘకాలిక లక్ష్యం లేనే లేదని ఆయన అంటున్నారు. గ్రేటర్ హైదరాబాద్ లో వర్షాలు కురిసినప్పుడు ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా ఏ చర్యలు తీసుకోవాలనే దానిపై శాస్త్రీయంగా ఆలోచించకపోవడం పౌరులకు శాపంగా పరిణమించిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విదేశాల్లో అమలవుతున్న అత్యుత్తమ విధానాలను అధ్యయనం చేసే చొరవ తీసుకోవడం లేదు. అప్పుడెప్పుడో కిర్లోస్కర్ కమిటీ నివేదిక ఇవ్వగా అది దుమ్ముకొట్టుకుని అటకెక్కింది. తాజాగా జీఐఎస్ పేరుతో నాలాలు అనుసంధానం అంటూ పట్టణాభివృద్ధి అధికారులు భజన మొదలు పెట్టారు. కాంటూర్ ను బట్టి నాలాలను ఎక్కడి వరకు తీసుకువెళ్లాలి? వాన వచ్చినప్పుడు నీళ్లు ఎక్కడెక్కడ నిల్చుంటున్నాయి? అనే అంశాలపై ఇటీవలే జీఐఎస్ సర్వే నిర్వహించారు. ఈ సర్వే పై జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు కూడా ప్రచారం చేసుకుంటున్నారు. ఇది అమలు చేస్తే హైదరాబాద్ నగరం గ్లోబల్ సిటీగా అవతరిస్తుందని, నీళ్ల కన్పించవని చెబుతుండడం విశేషం.గ్రేటర్ హైదరాబాద్‌లో గత రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలతో జనజీవనం ఎక్కడికక్కడ స్తంభించి పోతున్నది. వర్షం



వస్తుందంటే జనాల్లో వణకుడు మొదలయి భీతిల్లిపోతున్నారు. ఒకటి రెండు సెంటిమీటర్ల వాన వస్తే రోడ్లపై వాహనాలు నెమ్మదిస్తాయి. ఇక ఆ పైన నాలుగైదు సెంటిమీటర్లు వర్షం వస్తే ఇక అంతే సంగతులు. రోడ్ల మీద వర్షం నీరు గోదావరి నది మాదిరి వరదలై పారుతుంది. ఒకటి రెండు అడుగులు కూడా వాహనాలను ముందుకు కదలనిచ్చే పరిస్థితి ఉండదు. ఏడెనిమిది సెంటిమీటర్ల వాన వస్తే నడిరోడ్లపై వాహనదారులు జాగారం చేయాల్సిందే. గంటల కొద్దీ రోడ్ల మీద వేచి ఉండక తప్పదు. నెమ్మది నెమ్మదిగా ముందుకు వెళ్తూ ఇంటికి చేరుకోవడానికి రెండు నుంచి మూడు గంటల సమయం తీసుకుంటుంది. జంక్షన్లు వాహనాలతో కిక్కిరిసిపోయి ఉంటాయి. ఇక మాదాపూర్ హైటెక్ సిటీ పరిసర ప్రాంతాలలో కిలోమీటర్ల కొద్దీ వాహనాలు బారులు తీరి ఉంటాయి. ఈ మూల ఆ మూల అనే తేడా లేకుండా గ్రేటర్ హైదరాబాద్ మొత్తం ట్రాఫిక్‌లో కిక్కిరిసి పోయి వాహనదారుల సహనానికి పరీక్ష పెట్టింది. వర్షాల ధాటికి ట్రాఫిక్ ను నియంత్రించలేమంటూ సైబరాబాద్ పోలీసులు చేతులెత్తేశారు. ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హొమ్ ఇవ్వాల్సిందిగా పోలీసులు వేడుకోవాల్సిన దుస్థితి తెచ్చారు. అయినప్పటికీ ఆ ప్రాంతంలో ట్రాఫిక్ ఝుంజాటం తప్పడం లేదు. భారీ వర్షాలతో నగరం అతలాకుతలం అయి జనజీవనానికి ఇబ్బందులు తలెత్తిన సందర్భంలో ముఖ్యమంత్రి సమీక్షలు నిర్వహించడం, ఏదో చేస్తున్నామని ప్రకటనలు గుప్పించడం మినహా ఆ తరువాత అవి కార్యరూపం దాల్చడం లేదని పరిశీలకులు విమర్శిస్తున్నారు. వరదనీటి ముప్పుపై శాస్త్రీయ కోణంలో సమస్యను పరిష్కరించేందుకు ఏమాత్రం శ్రద్ధ చూపించడం లేదని అంటున్నారు. గత నాలుగు దశాబ్దాలుగా ఎక్కడెక్కడ వాన నీళ్లు పొంగిపొర్లుతూ ప్రజలకు కంటినిండా కునుకు లేకుండా చేస్తున్నాయి. వర్షం తరువాత తలెత్తుతున్న సమస్యలు ఏంటి? ట్రాఫిక్‌కు కలుగుతున్న అంతరాయాలేంటి? అనే విషయాలపై ప్రభుత్వ పెద్దలు సూక్ష్మస్థాయిలో సమీక్షించడం లేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో యావత్ గ్రేటర్ హైదరాబాద్ పండుటాకులా వణికిపోయింది. లోతట్టు ప్రాంతాలు మునిగిపోగా, ప్రధాన రహదారులు, గల్లీ రోడ్లు చెరువులను తలపించాయి. ప్రభుత్వం ఉందా, జీహెచ్ఎంసీ అధికారులు పనిచేస్తున్నారా అంటూ ప్రజలు దుమ్మెత్తిపోశారు. ప్రజాగ్రహాన్ని గమనించారో మరే కారణమో తెలియదు కాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమీర్ పేట మైత్రివనం ప్రాంతంలో తనిఖీలు నిర్వహించి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ముంపు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ తరువాత పట్టణాభివృద్ధి అధికారులు, మూసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏం చర్యలు తీసుకుంటారో, నిధులు ఎక్కడి నుంచి సమకూర్చుకుంటారో వారికే తెలియాలి.

## తలోమాట!

హైదరాబాద్,తెలంగాణ కాంగ్రెస్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు పెను తిప్పలు పెడుతున్నాయి. తలోమాటతో ఈ ఎన్నిక ల వ్యవహారం... పార్టీ అధిష్టానానికి.. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డికి కూడా ఇబ్బందులు తెస్తున్నాయి. వాస్తవానికి.. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఎట్టి పరిస్థితిలోనూ మూడు మాసాల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఇప్పటికే 40 రోజులకు పైగా కాలం గడిచిపోయింది. అయినప్పటికీ.. ఈ ఎన్నికలపై పార్టీ నుంచి ఎలాంటి నిర్ణయం రాలేదు. ప్రభుత్వం కూడా వేచి చూస్తోంది. ఇంతలోనే దీనిపై భిన్నమైన వాదనలు వస్తున్నాయి.పార్టీ చీఫ్.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతే ఎన్నికలకు వెళ్దామని పట్టుదలతో ఉన్నారు . దీనిపై సీఎం రేవంత్ కూడా ఏకాభిప్రాయంతోనే ఉన్నారు. కానీ, అటు రాష్ట్రపతి బీసీ రిజర్వేషన్‌లకు సంబంధించిన బిల్లును ఆమోదించలేదు. పోనీ.. గవర్నర్ అయినా.. ఆర్డినెన్సుకు ఆమోదం చెప్పారా? అంటే అది కూడా లేదు. దీనిపై ఢిల్లీ స్థాయిలో పోరాటాలు చేసిన ఫలితం అయితే దక్కలేదు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించే ప్రక్రియ ఇప్పట్లో ముందుకు సాగేలా కనిపించడం లేదు.మరోవైపు.. బిల్లు చేసి, స్థానిక సంస్థల్లో అమలు చేయకపోతే.. అది సర్కారు చేసిన కృషికి ఎలాంటి ఫలితం ఇవ్వదన్నది పీసీసీ చీఫ్ ఆలోచన. ఇక, మంత్రులు కూడా.. బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తే.. మేలు జరుగుతుందని చెబుతున్నారు. కానీ.. దీనిని ఎలా అమలు చేయాలన్న విషయంపై ముఖ్యమంత్రి ఆలోచనలో పడ్డారు. ఈ క్రమంలో తాజాగా రాజకీయ వ్యవహారాల కమిటీతో భేటీకి నిర్ణయించారు. దీనిలో మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులను కూడా కలుసుకుని నిర్ణయించనున్నారు.

**పార్టీకే పరిమితం!**

ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో హైకోర్టు ఆదేశాల మేరకు.. ఎన్నికలు నిర్వహించక తప్పని పరిస్థితి ఏర్పడిం ది. ఈ నేపథ్యంలో ఈ సారికి పార్టీ వరకే రిజర్వేషన్ అమలు చేయడం ఖాయంగా కనిపిస్తోంది. ఆది నుంచి సీఎం రేవంత్ రెడ్డి.. ఈ విషయాన్ని ప్రకటిస్తున్న దరిమిలా.. ఇప్పుడు నిర్వహించే రాజకీయ వ్యవహారాల కమిటీలోనూ.. ఇదే నిర్ణయం దిశగా అడుగులు వేసే అవకాశం ఉంది. అంటే.. పార్టీలోని బీసీలకు 42 శాతం టికెట్లు ఇచ్చి.. వారిని బరిలోనిలిపే ప్రక్రియకే ప్రస్తుతం పరిమితం కానున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది.

## సిఇసిపై అభిసంశనకు కాంగ్రెస్ సమాయత్తం

న్యూఢిల్లీ,ఓట్ల చోరీ జరిగిందని ఆరోపిస్తూ ఎన్నికల సంఘం లక్ష్యంగా విపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తోన్న నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌పై అభిశంసనకు సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. దానికి సంబంధించి నోటీసును తీసుకువచ్చేందుకు ప్రతిపక్ష సభ్యులు యోచన చేస్తున్నారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఆ వ్యవహారంపై తాము త్వరలో నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ మీడియాకు వెల్లడించారు. సీఈసీని తొలగించాలంటే పార్లమెంట్ ఉభయ సభల్లో మూడింట రెండొంతుల మెజార్టీ అవసరం. అయితే ప్రతిపక్షాలకు పార్లమెంట్‌లో అంతమంది సభ్యులు లేరు. ఇలాంటి చర్యను బిజెపి కూడా అంగీకరించదు. ఓట్ల చోరీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆందోళన కార్యక్రమం మొదలుపెట్టిన నేపథ్యంలో జ్ఞానేశ్ కుమార్ ఆదివారం ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్‌సింగ్ సంధు, వివేక్‌జోషీతో కలిసి మీడియాతో మాట్లాడారు.

# వీళ్లు సర్దుకుపోరు.. వాళ్లు సర్ది చెప్పరు.. పొలిటికల్ ఫైట్..!

అమరావతి,రాష్ట్రంలో సీనియర్ నాయకులకు, జూనియర్ నేతలకు మధ్య గ్యాప్ పెరుగుతోంది. వాస్తవానికి గ్యాప్ మం చిది కాదు. ఒకే పార్టీలో ఉన్న నాయకులకు మధ్య కూడా ఈ గ్యాప్ స్పష్టంగా కనిపిస్తోంది. కొత్తగా ఎన్నికైన వారు.. సర్దుకుపోవడం లేదు. పాత నేతలు.. వారికి సర్దిచెప్పరు. దీంతో పొలిటికల్‌గా పార్టీల్లో ఫైటింగ్ అంత ర్గతంగా జోరుగా సాగుతోంది. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో టీడీపీ కొత్తవారికి అవకాశం ఇచ్చింది. ఇక, జన సేన కూడా.. సీనియర్లు సహా కొత్తవారికి ఛాన్స్ ఇచ్చింది.అయితే.. క్షేత్రస్థాయిలో వీరంతా టికెట్లు త్యాగం చేసిన ఇతర పార్టీల నేతలు, లేదా సొంత పార్టీల నాయకు లు (టికెట్ వస్తుందని చివరి నిమిషం వరకు ఎదురు చూసి.. ఏర్పాట్లు చేసుకున్న నేతలు)తో కలిసి పోవాలి. ఇది జనసేన, టీడీపీ అధిష్టానాల నుంచి కూడా వస్తున్న సూచన. కానీ, క్షేత్రస్థాయిలో గెలిచిన వారికి.. వారికి టికెట్లు త్యాగం చేశామని చెప్పుకొంటున్న సీనియర్లకు కూడా.. పడడం లేదు. అంతేకాదు.. కొందరు పొరుగు పార్టీల నుంచి వచ్చి పోటీ చేసి విజయం దక్కించుకున్నారు. ఉదాహరణకు మైలవరం, నూజివీడు, కోవూరు(నెల్లూరు) వంటివి స్పష్టంగా ఉన్నాయి.వీటికితోడు.. కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో పొరుగు ప్రాంతాల నుంచి వచ్చి పోటీ చేసి విజయం దక్కించు కున్న వారు ఉన్నారు. వీరిలో తిరువూరు, కొవ్వూరు, అనంతపురం అర్బన్ వంటివి ఉన్నాయి. ఇలాంటి నియోజక వర్గాల్లో సీనియర్లకు, జూనియర్లకు మధ్య తీవ్ర వివాదాలు ముసురుకున్నాయి. అయితే.. సీని యర్లను కలుపుకొని పోవాలని.. టీడీపీ, జనసేన అధిష్టానాలు.. ఎమ్మెల్యేలకు చెబుతున్నాయి. ఈ విషయం లో ఎలాంటి సందేహం లేదు. అవసరమైతే.. వారి నుంచి సలహాలు కూడా తీసుకోవాలని సూచిస్తున్నాయి.కానీ, గెలిచిన నేతలు, ముఖ్యంగా ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యేలు మాత్రం ఈ విషయాన్ని.. తూ.చ. తప్పకుండా.. పక్కన పెట్టేశారు. అంతేకాదు.. సీనియర్లను ఏమాత్రం పట్టించుకోలేదు. పైగా.. త్యాగాలపై కూడా.. చిన్న చూపు చూస్తున్నారు. ఈ పరిణామాలతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 40 నియోజకవర్గాల్లో జనసేన, టీడీపీ నాయకుల మధ్య వివాదాలు.. విభేదాలు పెద్ద ఎత్తున రాజకీయ రచ్చ రేపుతున్నాయి. అందరూ కలివిడిగా ఉండాలన్న అధినేతల మాటలు.. నీటి మూటలుగా మారుతున్నాయి. ఇదే.. అసలు సమస్యగా మారిందన్నది విశ్లేషకులు చెబుతున్న మాట. దీనిని పరిష్కరించేందుకు తరచుగా.. ఉమ్మడి సమావేశాలు అధిష్టానం స్థాయిలో జరిగితే బెటర్ అన్న సూచనలు వస్తున్నాయి.

# ఉలిక్కిపడిన ప్రభుత్వం ఏం చేసిందంటే..?



విజయవాడ ,విజయవాడ నగరానికి ముంపు ప్రమాదం ఉందని, కొండవీటి వాగు ఉధృతి వల్ల గుంటూరు జిల్లా పొన్నూరు మునిగిపోనుందని ప్రచారం చేసిన మీడియా చానళ్లపై ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. ప్రజలను భయభ్రాంతులను చేసేలా కథనాలు ప్రచారం చేయడాన్ని సీరియస్ గా పరిగణించిన ప్రభుత్వం వైసీపీ అనుకూల మీడియా చానళ్లపై రెండు కేసులు నమోదు చేసింది. ఇంజనీరింగ్ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఆ రెండు చానళ్లపై పోలీసులు కేసులు నమోదు చేశారు. దీంతో ప్రభుత్వం వ్యూహంపై సస్పెన్స్ ఏర్పడింది.ప్రకాశం బ్యారేజ్ గేట్లు మరమ్మతులకు గురికావడంతో ప్రాజెక్టు గేట్లు తెరుచుకోవడం లేదని, దీనివల్ల విజయవాడ ముంపునకు లోనయ్యే అవకాశం ఉందని ఓ యూట్యూబ్ చానల్ కథనం ప్రసారం చేసింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవడంతో విజయవాడ వాసులు భయాందోళనలకు గురయ్యారు. గత ఏడాది అనుభవనాలను గుర్తుకు తెచ్చుకుని హడలిపోయారు. అదేవిధంగా అమరావతి ముంపునకు గురికాకుండా కొండవీటి వాగును ఎత్తిపోసి వరదను గుంటూరు చానల్ లోకి మళ్లిస్తున్నారని, దీనివల్ల గుంటూరు జిల్లాలోని పొన్నూరు మునిగిపోయే అవకాశం ఉందని వైసీపీకి అనుబంధంగా పనిచేస్తున్న మెయిన్ స్ట్రీమ్ మీడియాలో మరో కథనం ప్రసారమైందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.వైసీపీ నేత అంబటి మురళీకృష్ణ ఈ విషయంపై మీడియాతోనూ మాట్లాడారు. అయితే గుంటూరు చానల్ కు అసలు నీరే వదల్లేదని ఇంజనీరింగ్ అధికారులు ఖండించారు. వర్షాల వల్లే స్థానిక డ్రెయిన్లు, కాలువలు ద్వారా ప్రవాహాలు వచ్చి చేరినట్లు తెలిపారు. అంతేకాకుండా పొన్నూరు మునుగోతోందంటూ తప్పుడు ప్రచారం చేశారని ఆరోపిస్తూ, ప్రజలను భయాందోళనకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కొండవీటి వాగు ప్రాజెక్టు ఏఈఈ సీహెచ్ అవినాశ్ ఆదివారం తాడేపల్లి పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మీడియా చానల్, ఇతరులపై విపత్తు నిర్వహణ చట్టం-2025 కింద బీఎన్ఎస్ 353(1), సెక్షన్ 45 కింద కేసులు నమోదు చేశారని చెబుతున్నారు. అదేవిధంగా ప్రకాశం బ్యారేజీ గేటు పనిచేయడం లేదని అసత్య కథనం ప్రసారం చేసిన సుమన్ టీవీపైనా అధికారులకు ఫిర్యాదు చేశారు. 67వ నంబరు ఖానా వద్ద గేటు పనిచేస్తోందని స్పష్టం చేశారు. 'విరిగిపోయిన 67వ గేటు.. భారీ వరదకు విజయవాడ మునిగేలా ఉంది' అంటూ ప్రసారం చేసిన యూట్యూబ్ చానల్ పై ఏఈఈ సత్య రాజేశ్ శనివారం ఫిర్యాదు చేశారు. దీంతో బీఎన్ఎస్ 353(1), 54 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి పోలీసులు విచారణ ప్రారంభించారు. తప్పుడు కథనాలపై వన్ టౌన్ కేసు నమోదు చేశారు. దీంతో ప్రభుత్వ చర్యలు చర్చనీయాంశంగా మారాయి. ఇన్నాళ్లు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం, అనుచిత వ్యాఖ్యలపై వ్యక్తులు, వైసీపీ కార్యకర్తలపైనే కేసులు నమోదు చేశారు. నిందితులను అరెస్టుచేసి జైలుకు పంపారు. కానీ, ఇప్పుడు తొలిసారిగా రెండు మీడియా సంస్థలపై కేసులు నమోదు చేయడం పెను సంచలనంగా మారింది.సహజంగా వార్తా కథనాలను ప్రసారం చేసిన సమయంలో అందులో వాస్తవం లేకపోతే ప్రభుత్వం ఖండిస్తుంది. తమ వివరణను ప్రచారం చేయాల్సిందిగా సంబంధిత మీడియాను కోరుతుంది. కానీ, తప్పుడు కథనాలు ప్రసారం చేశారన్న ఆరోపణలతో ఏకంగా కేసులు నమోదు చేయడమే చర్చనీయాంశంగా మారింది. కొద్ది రోజుల క్రితం సాక్షి టీవీ డిబేట్ లో అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ప్రభుత్వం కేసులు నమోదు చేసింది. సాక్షి టీవీ సీనియర్ జర్నలిస్టు కొమ్మినేనితోపాటు కేఎస్ఆర్ లైవ్ షోలో పాల్గొన్న మరో జర్నలిస్టు కృష్ణంరాజును అరెస్టు చేయించింది. అయితే ఇప్పుడు ఆ కేసుకు దీనికి సంబంధం లేకపోయినా, తప్పు చేస్తే అరెస్టు చేసి జైలుకు పంపుతామన్న ప్రభుత్వ వైఖరి తాజా పరిణామాలతో మరోసారి పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం కేసులు నమోదుచేసిన వ్యవహారంలో నిందితులను అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# ఆహ్వానాలు లోకేష్‌కే.. రీజనేంటి ..!



అమరావతి,టీడీపీలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. సీఎం చంద్రబాబు కొన్ని కొన్ని కార్యక్రమాలకు దూరంగా ఉంటూ.. ఆ స్థానంలో ఆయన తనయుడు, మంత్రి నారా లోకేష్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా పార్టీ నాయకులు, ఇతర ప్రముఖుల ఇళ్లలో జరుగుతున్న శుభకార్యాలకు.. సీఎం చంద్రబాబు స్థానంలో ఇటీవల కాలంలో మంత్రినారాలోకేష్ కనిపిస్తున్నారు. దీని వెనుక ఎలాంటి వ్యూహం ఉందన్నది పక్కన పెడితే.. ప్రస్తుతం నారా లోకేష్‌పై మాత్రం అంతర్గతంగా చర్చ అయితే సాగుతోంది. ఆయనను మరింతగా ప్రచారంలోకి తెచ్చేందుకు, మరింతగా పార్టీలో కలుపుకొని పోయేలా.. వ్యవహరిస్తున్నారన్నది ఈ చర్చల సారాంశం.ఇటీవల ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఓ నాయకుడి కుమారుడి వివాహ రిసప్షన్ జరిగింది.. దీనికి మంత్రి నారా లోకేష్ ను పంపించారు. వాస్తవానికి చంద్రబాబుకు ఆహ్వానం అందినా.. ఆయన వెళ్లకుండా.. లోకేష్‌కు అవకాశం ఇచ్చారు. అదేవిధంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో దగ్గుబాటి వెంకటేశ్వరావు సొంతగా నిర్మించిన ఓ స్కూలు ప్రారంభోత్సవానికి కూడా సీఎం చంద్రబాబు ను ఆహ్వానించారు. కానీ, ఆయన వెళ్లకుండా నారా లోకేష్‌ను పంపించారు. ఇలా.. ప్రైవేటు కార్యక్రమాలకు చంద్రబాబు దూరంగా ఉంటున్నారు. తాజాగా మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె వివాహానికి సంబంధించి నిశ్చితార్థ కార్యక్రమాన్ని నిర్వహించారు.వాస్తవానికి దీనికి సీఎం చంద్రబాబునే నిమ్మల ఆహ్వానించినట్టు తెలిసింది. కానీ.. దీనికి కూడా నారా లోకేష్‌నే పంపించారు. దీని కి ముందు మాజీ మంత్రి దేవినేని ఉమా కుమారుడి వివాహ కార్యక్రమానికి కూడా మంత్రి నారా లోకేషే వెళ్లారు. అప్పట్లో తెలంగా ణ సీఎం రేవంత్ రెడ్డితో కలిసి నారా లోకేష్ ఫొటోలు దిగి సందడి చేసిన వ్యవహారం మీడియాలో ప్రముఖంగా వచ్చింది. ఇలా.. నారా లోకేష్ ప్రైవేటు కార్యక్రమాలకు రావడం తప్పుకాదు కానీ, చంద్రబాబు రాకుండా.. మంత్రికి ప్రాధాన్యం ఇవ్వడమే చర్చకు దారితీసింది. అయితే.. రాజకీయంగానే కాకుండా.. ఆత్మీయ కలయికల ద్వారా కూడా నారా లోకేష్ గ్రాఫ్ పెంచాలన్న వ్యూహం తోనే చంద్రబాబు ఇలా చేస్తున్నారన్న వాదన వినిపిస్తుండడం గమనార్హం.ఇప్పుడు కాకపోతే.. మరికొన్నాళ్లకైనా.. పార్టీ బాధ్యతలను నారా లోకేష్‌కు అప్పగించడం ఖాయమనే విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే.. ఆయనను అన్నివైపుల నుంచి ప్రమోట్ చేయడంతోపాటు.. పార్టీ పరంగా, నాయకుల పరంగా కూడా.. మరింత ఆత్మీయంగా ఆయనను కలుపుకొని పోయేలా చేయాలన్న వ్యూహమే ఉందని అంటున్నారు. పైగా ఇలాంటి కార్యక్రమాలకు వెళ్లడం ద్వారా.. కేవలం రాజకీయాలకు మాత్రమే పరిమితం కాకుండా.. ఆయా కుటుంబాలకు కూడా నారా లోకేష్ చేరువ అవుతారు. ఇది వ్యక్తిగతంగా ఆయనకు మేలు చేస్తుందన్న ఆలోచన కూడా ఉంది. ప్రస్తుతం నారా లోకేష్‌కు ప్రాధాన్యం ఇవ్వడం.. లేదా.. ఆయనను ప్రమోట్ చేయడం మంచిదేనని అంటున్నారు సీనియర్లు.

## ఇదో చెత్త సర్కార్

హైదరాబాద్, తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు పనితీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ-ఆర్ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో శాఖల సమన్వయ లోపంతో ఎక్కడ చూసినా మురుగు నీరు, చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయని మండిపడ్డారు. వ్యాధులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 'ఇదొక 'చెత్త' సర్కారురాష్ట్ర మున్సిపల్ శాఖ, ఆరోగ్య శాఖల సమన్వయ లోపంతో ఎక్కడ చూసినా మురుగు నీరు, చెత్త కుప్పలతో హైదరాబాద్ నగరం, రాష్ట్రంలోని ఇతర పట్టణాలు కంపుకొడుతున్నాయి. ఈ వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు- దవాఖానలు రోగులతో కిటకిటలాడుతున్నాయి.' అని కేటీఆర్ పేర్కొన్నారు. 'బీఆర్ఎస్ హయాంలో వర్షాకాలానికి 2 నెలల ముందు నుంచే సీజనల్ వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలపై మున్సిపల్ శాఖ, జీహెచ్ఎంసీ, వైద్య ఆరోగ్యశాఖలు సమీక్షా,

# మోడీ ఆర్ఎస్ఎస్ కి భయపడ్డారా ?



న్యూఢిల్లీ,నరేంద్ర మోడీ. హిమ పర్వతం లాంటి వారు. మేరు నగధీరుడు. అజేయుడు, ఆయన గుండె ధైర్యం ప్రత్యర్థులకు దడ పుట్టిస్తుంది. ఇవన్నీ మోడీని తరచూ కీర్తించే వారి నోటి నుంచి వచ్చే పడి కట్టు పదాలు మరి మోడీ కూడా జడుస్తారా లేక భయపడతారా అంటే ప్రత్యర్థి కాంగ్రెస్ నేతలు అయితే ట్రంప్ కిమోడీ భయపడతారు అని ఒక్కటే విధంగా విమర్శలు చేస్తారు. ఇప్పటిదాకా ట్రంప్ చేసిన ఏ ప్రకటన మీద మోడీ వివరణ నేరుగా ఇవ్వలేదని వామపక్షాలు సైతం తప్పు పడతాయి. మరి అది రాజకీయంగా చేసే విమర్శలుగా కొట్టి పారేసినా నిజంగా మోడీ భయపడతారాఅదికూడా తాను పుట్టి పెరిగిన ఆర్ఎస్‌కి భయపడతారా అంటే అక్కడ ఆసక్తికరమైన విషయాలుఉన్నాయని అంటున్నారు.

సంఘ్ పవర్ ఫుల్ :

బీజేపీకి కర్త కర్మ క్రియ ఇవన్నీ ఆర్ ఎస్ ఎస్ అని ఘంటాపథంగా చెబుతారు. సంఘ్ మొదట పుట్టింది. తరువాత జన సంఘ్ పుట్టింది ఆ జన సంఘ్ కి మారు రూపమే బీజేపీ. అలాంటిది సంఘ్ నుంచే అంతా నాయకత్వం నేర్చుకుని బీజేపీలోకి వస్తారు. అందుకే సంఘ్ అంటే అంతా భయంతో కూడిన భక్తితో కడు వినయంగా ఉంటారు మోడీ కూడా సంఘ్ నుంచి వచ్చిన వారే. ఆయనకు సంఘ్ అంటే ఏమిటో పూర్తిగా తెలుసు అని కూడా అంటారు.

బీజేపీ వెనక ఆర్ఎస్ఎస్ :

బీజేపీ ప్రతీ విజయంలో ప్రతీ అడుగులో ఆర్ఎస్ఎస్ ఉంది. బీజేపీ ఎపుడు అధికారంలోకి వచ్చినా కచ్చితంగా ఆర్ఎస్ఎస్ గ్రౌండ్ లెవెల్ లో చేసే వర్క్ తో అని అంతా నమ్ముతారు. బీజేపీకి మొత్తం దిశా నిర్దేశం చేసేదే ఆర్ఎస్ఎస్ అన్నది కూడా ఒక నిశ్చితాభిప్రాయంగా ఉంది. బీజేపీకి గురువుగా ఒక శ్రేయోభిలాషిగా ఒక పెద్దగా ఆర్ఎస్ఎస్ ఉంటుంది. బీజేపీ రాజకీయంగా చేసే తప్పు ఒప్పులను కూడా నివేదించి ఎప్పటికపుడు సవరించే ప్రయత్నం చేస్తూ ఉంటుంది. అలాంటి సంఘ్ అంటే బీజేపీలో అందరికీ భయమే అని చెబుతారు.

కోపంతో పాటు గ్యాప్ :

ఇదిలా ఉంటే బీజేపీ పెద్దలుగా కాషాయ ద్వయంగా పేరు గడించిన నరేంద్ర మోడీ అమిత్ షా ఈ ఇద్దరూ కూడా ఆ మధ్య కాలంలో ఆర్ఎస్ఎస్ అంటే ఎందుకో ఆగ్రహంగా ఉన్నారని అంటున్నారు. దాంతో 2024 ఎన్నికల్లో కూడా ఆర్ఎస్ఎస్ ని పక్కన పెట్టారు అని అంటున్నారు. అలా ఆర్ ఎస్ ఎస్ ని పక్కన పెడితే ఏమైందో తరువాత ఫలితాలతో పూర్తిగా వారికి అర్థం అయింది అని కూడా చెప్పుకుంటున్నారు అయితే కొంతకాలంగా బీజేపీకి ఆర్ఎస్ఎస్ కి మధ్య చాలా అంశాలలో భేదాభిప్రాయాలు ఉన్నాయని అంటున్నారు

మోడీ మార్క్ కితాబులు :

అయితే కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చాక మళ్లీ ఆర్ఎస్ఎస్ ని దగ్గర తీయడం మొదలెట్టారు అని అంటారు దాంతో ఆ ప్రభావం హర్యానా మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల మీద పడి బీజేపీకి మంచి విజయాలు దక్కాయని కూడా గుర్తు చేస్తారు. ఇటీవలనే మోడీ నాగపూర్ లోని ఆర్ఎస్ఎస్ కార్యాలయం కూడా సందర్శించి వచ్చారు. ఆయన పదకొండేళ్ళ ప్రధానమంత్రిత్వంలో ఎపుడూ సంఘ్ కార్యాలయానికి వెళ్ళింది లేదని కూడా గుర్తు చేస్తారు. ఇక తాజాగా జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఎర్ర కోట మీద మోడీ ప్రసంగితూ ఆర్ఎస్ఎస్ కి కితాబులు ఇచ్చారు. సంఘ్ సేవలను ఎంతగానో మెచ్చుకున్నారు. వందేళ్ళ ప్రయాణంలో ఆర్ఎస్ఎస్ ఎంతో సాధించింది అని కూడా జాతి జనులకు బిగ్గరగా చెప్పారు.

నాడు అలా నేడు ఇలా :

ఇక బీజేపీకి ఎంతో సమర్థత ఉందని ఆర్ఎస్ఎస్ తమకు అవసరం లేదని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా గత లోక్ సభ ఎన్నికల ముందు సంచలన వ్యాఖ్యలు చేసారు. దాని మీద ఆర్ఎస్ఎస్ కూడా బహిరంగంగా వ్యాఖ్యలు చేయలేదు అయితే లోక్ సభ ఎన్నికల్లో సీట్లు తగ్గాక కానీ బీజేపీ పెద్దలకు తత్వం బోధపడలేదని దాంతో సంఘ్ తో తమ బంధాలను మెరుగుపరచుకోవడానికి ప్రయత్నాలు ఒదలెట్టారు అని గుర్తు చేస్తున్నరు.

బీజేపీ అధ్యక్షుడి ఎన్నికతో క్లారిటీ :

ఇక బీజేపీ పెద్దగా ప్రధానిగా మోడీ ఆర్ఎస్ఎస్ ని పొగిడారు దాని వెనక చాలా అంశాలు ఉన్నాయని అంటున్నారు. బీహార్ తమిళనాడు వంటి అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2029లో జరిగే లోక్ సభ ఎన్నికలు కూడా దృష్టిలో పెట్టుకుని ఆర్ఎస్ఎస్ కి దగ్గర కావాలని కో ఆర్డినేట్ చేసుకోవాలని బీజేపీ పెద్దలు భావిస్తున్నారు అని అంటున్నారు అయితే ఈ కో ఆర్డినేషన్ ఫలితాలు ఏమిటి ఎలా అన్న దానికి ఒక కొలమానంగా కొత్త బీజేపీ ప్రెసిడెంట్ ఎవరు అన్నదానిని బట్టి అర్థం అవుతుంది అని అంటున్నారు. సంఘీయుడికే ఈ పదవి ఇస్తే కనుక ఆర్ఎస్ఎస్ తో బీజేపీ కో ఆర్డినేషన్ సాఫీగా సాగుతున్నట్లే భావించాలి. పరిస్థితులు చూస్తే మోడీ అమిత్ షా ఆర్ఎస్ఎస్ అంతా కలసి బలమైన సంఘ్ నేతనే ఎంపిక చేయవచ్చు అన్న ఊహాగానాలూ ఉన్నాయి.

# సీఈసీ పై విపక్షాల అభిశంసన తీర్మానం.. సాధ్యమేనా?



హైదరాబాద్,దేశ రాజకీయాల్లో మరోసారి ఎన్నికల వ్యవహారం పెద్ద దుమారం రేపుతోంది. ఓట్ల చోరీ ఆరోపణలతో విపక్షాలు తీవ్రంగా మండిపడుతుండగా, ఇప్పుడు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌పై అభిశంసన తీర్మానం తీసుకురావాలన్న యోచనలో ఉన్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. కాంగ్రెస్ ఎంపీలు ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ, సయ్యద్ నసీర్ హుస్సేన్ మీడియాతో మాట్లాడుతూ, అవసరమైతే అభిశంసనను కూడా తీసుకొస్తామని సంకేతాలు ఇచ్చారు.

అభిశంసన తీర్మానం అంటే ఏమిటీ?

ఒక రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిని (ఉదా: ప్రధాన ఎన్నికల కమిషనర్, న్యాయమూర్తి, రాష్ట్రపతి) తన పదవీ బాధ్యతలను సరిగా నిర్వర్తించలేదని గాని లేదా తప్పు చేశాడని ఆరోపణలతో పదవి నుంచి తొలగించమని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అధికారిక తీర్మానం. ఇది సాధారణంగా చాలా కఠినమైన ప్రక్రియ. రెండు సభల్లో (లోక్‌సభ, రాజ్యసభ) మూడింట రెండొంతుల మెజార్టీతో ఆమోదం పొందితేనే ఆ వ్యక్తిని పదవి నుంచి తప్పించవచ్చు. అంటే ఇది ప్రజాస్వామ్యంలో అత్యంత తీవ్రమైన శిక్షా విధానం లాంటిది.సీఈసీపై అభిశంసన అంటే అది సులభం కాదు. పార్లమెంట్ ఉభయ సభల్లో మూడింట రెండొంతుల మెజార్టీ ఉండాలి. ప్రస్తుత పరిస్థితుల్లో విపక్షాలకు ఆ సంఖ్య లేదు. అయినా, విపక్షాలు ఈ ప్రయత్నం ద్వారా ఒక రాజకీయ సందేశాన్ని పంపించాలనుకుంటున్నాయి. ఎన్నికల సమయంలో జరిగిన అనుమానాస్పద సంఘటనలపై ప్రజల దృష్టిని మరల్చడమే ప్రధాన ఉద్దేశమని తెలుస్తోంది.ఇక మరోవైపు, రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ కౌంటర్ ఇచ్చారు. రాహుల్ ఆరోపణలు నిజమైతే ఆధారాలు సమర్పించాలి అని ఆయన స్పష్టం చేశారు. వారం రోజుల్లో ప్రమాణపత్రం రూపంలో సాక్ష్యాలను ఇవ్వాలని అల్టిమేటం జారీ చేశారు. ఎన్నికల కమిషన్‌ను లక్ష్యంగా చేసుకుని చేసే రాజకీయాలను ఇక సహించబోమని ఆయన ఘాటుగా పేర్కొన్నారు.దీనిపై రాహుల్ గాంధీ కూడా వెనుకడుగు వేయలేదు. 2023లో ప్రభుత్వం చేసిన చట్టసవరణలను ప్రస్తావిస్తూ, ఎన్నికల కమిషనర్లపై కేసులు నమోదు కాకుండా ప్రత్యేక రక్షణ కల్పించారని ఆరోపించారు. ఇది మోదీలకు సహకరించే ప్రయత్నమేనని, ఓట్ల చోరీలో ఈసీ భాగస్వామ్యం ఉందని తీవ్ర విమర్శలు చేశారు. ఈ వ్యవహారంపై ఆయన బిహార్‌లో యాత్ర కూడా మొదలుపెట్టారు. ఈ పరిణామాలు చూస్తే, రాబోయే రోజుల్లో సీఈసీపై ప్రతిపక్ష దాడులు మరింత ముదిరే అవకాశం ఉంది. అభిశంసన తీర్మానం ఆమోదం పొందకపోయినా, రాజకీయంగా అది ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికే దోహదపడుతుందనే కామెంట్స్ వస్తున్నాయి.

# ఎస్సీనా-బీసీనా.. కాంగ్రెస్ తేల్చుకునే సమయం!

హైదరాబాద్,ఉపరాష్ట్రపతి ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. ఈ నెల 21తో ఈ ఎన్నికకు సంబంధించిన నామినేషన్ ప్రక్రియ కూడా పూర్తి కానుంది. ఈ క్రమంలో తాజాగా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి తమిళనాడుకు చెందిన చంద్రాపురం పొన్నుసామి రాధాకృష్ణన్‌ను ఎంపిక చేసింది. ఈయన ఓబీసీ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ పొలిటీషియన్. రాజ్యాంగ బద్ధ పదవులు కూడా నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఆయనకు సరిసమానమైన పోటీ ఇవ్వగల నాయకుడి ఎంపిక.. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి పెద్ద అగ్నిపరీక్షగా మారనుంది.ఉపరాష్ట్రపతి పదవికి తొలుత ఎస్సీ నేతను ఎంపిక చేయాలని.. అది కూడా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అయితే.. మరీ మంచిదని కాంగ్రెస్ భావించింది. దీనిపై ప్రకటన కూడా చేయాలని అనుకున్న సమయం లో ఎందుకైనా మంచిది.. బీజేపీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలని భావించింది. ఇది కాస్తా.. నిర్ణయం జరిగింది. ఓబీసీ గౌండర్ సామాజిక వర్గానికి చెందిన సీపీ రాధాకృష్ణన్‌ను బీజేపీ ఎంపిక చే సింది. ఈయనను కేవలం కులం ఆధారంగానే కాకుండా.. అనుభవం ప్రాతిపదికన కూడా.. ఎంపిక చేసిన ట్టు స్పష్టంగా తెలుస్తోంది.ఈ రెండింటితో పాటు.. వచ్చే తమిళనాడు ఎన్నికలను కూడా లెక్కలోకి తీసుకుని.. బలమైన గౌండర్ సామాజిక వర్గానికి బీజేపీ పెద్దపీట వేసింది. అంతేకాదు.. తమిళనాడులో మంచి పేరు కూడా ఉంది. ఇలాం టి నాయకుడికి ఎదురెళ్లి.. అభ్యర్థిని ఎంపిక చేయడం అంటే.. కాంగ్రెస్ మిత్రపక్షాలకు అంత ఈజీయేమీ కాదు. పైగా.. అంతే స్థాయి, సామాజిక బలం, అనుభవం ఉన్న నాయకుడు కావాల్సి ఉంటుంది. కానీ, ఇవన్నీ ఉన్నవారు ఇప్పుడు కాంగ్రెస్‌లో కనిపించడం లేదు. పైగా.. బీజేపీ ఓబీసీకి ఇచ్చింది కాబట్టి.. తాము కనీసంలో కనీసం బీసీకి అయినా ఇవ్వాలి.ఇలా.. బీజేపీ వేసిన పాచికతో కాంగ్రెస్ అష్టదిగ్బంధం అయిపోయింది. అంతేకాదు.. బీజేపీకి ఉన్న మరో సానుకూలత.. ఎన్డీయే మిత్ర పక్షాలను మోడీ ముందుగానే ఏకతాటిపైకి తీసుకువచ్చారు. దీంతో ఈ ఎంపిక ఆయనకు మరింత సానుకూలంగా.. ఇబ్బంది లేకుండా నల్లేరుపై నడకగా మారిపోయింది. ఇలా చూసు కుంటే.. ఇండియా కూటమిలో భిన్నమైన వాదనలు ఉన్న పార్టీల మధ్య ఏకత్వం రావడంతోపాటు.. అభ్య ర్థి ఎంపిక కూడా అంత ఈజీ కాదన్నది విశ్లేషకులు చెబుతున్న మాట. ఒక చిన్న పదవికి అభ్యర్థిని ఎంపిక చేయడమే ఇండీ కూటమికి ఇబ్బందిగా ఉన్న పరిస్థితిలో ఇప్పుడు అతి పెద్ద ఉపరాష్ట్రపతి పదవికి అభ్యర్థిని ఎంపిక చేయడం.. అందునా.. కేవలం రెండు రోజుల్లోనే సాధ్యమా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com